


మేఘమాల..

తిరుమల వాతావరణం సోమవారం మధ్యాహ్నం ఒక్కసారిగా చిరుజల్లులతో ఆహ్లాదకరంగా మారింది. ఒకవైపు పొగమంచు, మరోవైపు చిరుజల్లులతో ప్రకృతి రమణీయత సంతరించుకుంది. చలితీవ్రత కొంత కనిపించింది. బ్రహ్మోత్సవాల వేళ తిరుమలలో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరుస్తోంది.

విరుల పందిరి

స్నపన తిరుమంజనం నేపథ్యంలో ఆలయంలో పుష్పాలంకరణ ఆకట్టుకుంది. శ్రీవారి సర్వదర్శనానికి 24 గంటల సమయం పడుతోందని తితిదే అధికారులు తెలిపారు. రూ.300 టికెట్లు కలిగిన వారికి మూడు గంటలు పడుతోంది. శ్రీవారిని ఆదివారం 86,859 మంది దర్శించుకున్నారు. హుండీ కానుకలు రూ.3.63 కోట్లు లభించాయి.

- న్యూస్‌టుడే, తిరుమల



కల్పవృక్షంపై తేజసం.. భూపాలుడిపై రాజసం

మూడోరోజు వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు

తిరుమల, న్యూస్‌టుడే: కొండా చూతమురారో కొండొక తిరుమల కొండా.. కొండనియడిగిన వరములొసగు.. అంటూ శ్రీవారి వైభవాన్ని తిరుమల విశిష్ఠతను అన్నమాచార్య తన సంకీర్తనల్లో అక్షరబద్ధం చేశారు. అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడి బ్రహ్మోత్సవ వేళ లక్షల మంది భక్తులు సప్తగిరుల్లో కిక్కిరిసి కనిపిస్తున్నారు. గోవింద గోవిందయని కొలువవో మనసా.. అంటూ స్వామివారిని కీర్తిస్తూ ఆ వైభవాన్ని కనులారా వీక్షిస్తూ తరిస్తున్నారు. ఈ జన్మకు ఈ భాగ్యము చాలదా.. అంటూ తన్మయత్వం పొందుతున్నారు.






● తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు సోమవారం ఉదయం కల్పవృక్ష వాహన సేవ కనుల పండువగా జరిగింది. వేణుగోపాల స్వామి అలంకారంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామి భక్తులకు అభయమిచ్చారు. ● రాత్రికి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామి సర్వభూపాల వాహనంపై శ్రీకృష్ణుడి అలంకారంలో దర్శనమిచ్చారు. సర్వభూపాల అంటే అందరు రాజులు అని అర్థం. వీరందరూ స్వామివారిని తమ భుజస్కంధాలపై, హృదయంలో ఉంచుకుని సేవిస్తారు. తద్వారా వారి పాలనలో ప్రజలు ధన్యులవుతారనే సందేశాన్ని ఈ వాహనసేవ నుంచి గ్రహించవచ్చు.








నేటి సేవలు

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో అత్యంత విశిష్టమైన శ్రీవారి గరుడ వాహనసేవ మంగళవారం సాయంత్రం 6.30 గంటలకు మొదలై 11 వరకు కొనసాగనుంది. ఉదయం 8 నుంచి 10 గంటలకు శ్రీమలయప్ప స్వామి మోహినీ అవతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

దారులన్నీ ఏడుకొండల వైపే..!

గరుడ వాహన సేవకు తరలివస్తున్న భక్తులు

ఈనాడు-తిరుపతి; తిరుమల, తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: అన్ని దారులూ అందరి నడకా ఆ సప్తగిరుల వైపే.. ఏ వాహనం చూసినా తిరుమల కొండకు ప్రయాణం కడుతోంది. తమవంతూ ఆ శ్రీనివాసుని చెంతకే అన్నట్లుగా పాదయాత్ర భక్తులు వడివడిగా అడుగులు వేస్తున్నారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం నిర్వహించనున్న కీలకమైన గరుడ వాహన సేవలో ఆ జగద్రక్షకుడైన శ్రీహరిని దర్శించుకునేందుకు తండోపతండాలుగా తరలివస్తున్నారు. నడకదారిలో అలిపిరి పాదాల మండపం నుంచి వడివడిగా అడుగులు వేస్తూ.. ఇక ఆ కాస్త మెట్లు ఎక్కేస్తే ఆ కోనేటి రాయుణ్ని తిలకించవచ్చంటూ భక్తిపారవశ్యంలో పులకించిపోతున్నారు.


అలిపిరి మెట్ల మార్గంలో భక్తుల రద్దీ

● గరుడోత్సవంలో భాగంగా మంగళవారం రాత్రి 11 గంటల వరకు శ్రీమలయప్పస్వామి మాడవీధుల్లో విహరించనున్నారు. సుమారు 3.5 లక్షల మంది భక్తులు వాహన సేవను తిలకించేందుకు ఆస్కారం ఉంది. గ్యాలరీల్లో సుమారు రెండు లక్షల మంది వీక్షించేలా ఏర్పాట్లు చేశారు.

● గ్యాలరీల వెలుపల ఉన్న భక్తులు వాహన సేవను తిలకించేలా ఏర్పాట్లు చేశారు. శ్రీమలయప్పస్వామి వాహన మండపం నుంచి వెలుపలికి వచ్చి తూర్పు మాడవీధి నుంచి దక్షిణం వైపు మళ్లిన తర్వాత ఆలయం ఎదురుగా ఉన్న గ్యాలరీల్లోని భక్తులను ఖాళీ చేయించి అక్కడ మళ్లీ కొత్త వారితో నింపనున్నారు. దీనివల్ల ఎక్కువమంది స్వామిని వీక్షించేందుకు వీలుంటుంది.

ఎక్కువ మంది దర్శించుకునేలా..



● సుపథం, మ్యూజియం, గోవింద నిలయం, మేదరమెట్ట, మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నదాన సత్రాల వైపు నుంచి మాడ వీధుల్లో వాహనానికి ఇరువైపులా తాళ్లను ఏర్పాటు చేసి భక్తులకు స్వామిని దర్శించుకునే వీలు కల్పించనున్నారు. దీనివల్ల ఒక్కో మార్గం నుంచి అదనంగా 20 వేల మంది దర్శించుకోవచ్చు. తిరుమలలోని ముఖ్య కూడళ్లలో 32 ఎల్‌ఈడీ తెరలు ఏర్పాటు చేశారు. ఇందులో తొమ్మిది పెద్ద తెరలు ఉన్నాయి.

అర్ధరాత్రి వరకు అన్నప్రసాదం



మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నదాన సత్రాన్ని ఉదయం 7 నుంచి అర్ధరాత్రి ఒంటి గంట వరకు భక్తులకు అందుబాటులో ఉంచనున్నారు. అదనంగా తిరుమలలోని పలు ప్రాంతాల్లో అన్నప్రసాద వితరణ కేంద్రాలు ఏర్పాటు చేశారు. గతంలో గరుడ సేవ రోజున 8.30 లక్షల మేరకు ఆహార పొట్లాలు అందించగా, ప్రస్తుతం 12.40 లక్షల మందికి సమకూర్చేలా ఏర్పాట్లు చేశారు.

మూడువేల ట్రిప్పులు



తిరుపతిలో ఎంపిక చేసిన ఐదు కేంద్రాల్లో వాహనాలు నిలుపుకొనే ఏర్పాట్లు చేశారు. అక్కడి నుంచి ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులు వేశారు. వీటిద్వారా గరుడసేవ రోజే మూడువేల ట్రిప్పులు తిప్పనున్నారు. తిరుమలలో వాహనాలకు ప్రత్యేక పార్కింగ్ సౌకర్యాలు కల్పించారు. సుమారు 15 ప్రాంతాల్లో 8,000 వాహనాలు పార్కింగ్ చేసుకునేలా చర్యలు చేపట్టారు.

పది ప్రాంతాల్లో జియో ట్యాగింగ్



చిన్నారులు, వృద్ధులు, మానసిక వికలాంగులు తప్పిపోతే గుర్తించడానికి వీలుగా జియో ట్యాగింగ్ అందుబాటులోకి తీసుకువచ్చారు. అందులో తల్లిదండ్రుల పేర్లు, కుటుంబ సభ్యుల ఫోన్ నంబర్లను నమోదు చేస్తున్నారు. పోలీసు విభాగం నుంచి 60 మంది, బాలల సంక్షేమ శాఖ నుంచి 20 మంది, తిరుమల బాలాజీనగర్‌లోని 120 మంది స్థానికులను వాలంటీర్లుగా నియమించారు. మొత్తం పది ప్రాంతాల్లో జియో ట్యాగింగ్ కొనసాగుతోంది. బ్రహ్మోత్సవాలకు వచ్చిన చిన్నారులు, నడవలేని వృద్ధులు, మానసిక వికలాంగులు 15 వేలమందికి ఇప్పటివరకు జియోట్యాగింగ్ చేశామని ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. తప్పిపోయిన 15 మందిని అప్పగించామన్నారు. భక్తులు అవసరమైతే పోలీసులు, వాలంటీర్ల సేవలను వినియోగించుకోవాలని సూచించారు.

దొంగల ఆటకట్టించేందుకు సాంకేతికత..

రద్దీ సమయంలో దొంగలు భక్తుల విలువైన ఆభరణాలు, నగదు, సెల్‌ఫోన్లు చోరీచేసే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని తిరుమల క్రైమ్ పీఎస్ సీఐ శేషగిరిరావు తెలిపారు. ఈనెల 2వ తేదీ నుంచి సోమవారం వరకు 80 మంది అనుమానితులను అదుపులోకి తీసుకోగా అందులో 11 మంది పాతనేరస్థులను గుర్తించి కేసులు నమోదు చేశారు. పాపిలాన్ డివైజర్ ఉపయోగిస్తూ వేలిముద్రల సాయంతో వారి ఆటకట్టిస్తున్నారు. ముఖ గుర్తింపు సాంకేతికత కెమెరాలు వినియోగిస్తున్నారు.

అనుమానాస్పద వ్యక్తులను గుర్తిస్తే 94407 96770, 0877-2289029కు సమాచారం అందించాలని కోరారు.

టెట్‌కు 2,674 మంది హాజరు

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా సోమవారం నాలుగు కేంద్రాల్లో టెట్ జరిగింది. ఉదయం పరీక్షకు 1,336 మందికిగాను 1,210 మంది, మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 1,338 మందికిగాను 1,218 మంది హాజరయ్యారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 200 వినతులు

తిరుపతి (కలెక్టరేట్): కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో 200 వినతులు వచ్చినట్లు జేసీ శుభం భన్సల్ తెలిపారు.

రైతేరాజు 6లో

జగనన్న లేఅవుట్‌కు కంచె

■ వైకాపా నాయకుడి దాష్టీకం
■ లబ్ధిదారులకు తప్పని ఇబ్బంది


తుమ్మూరు పరిధిలోని లేఅవుట్ వద్ద వేసిన కంచె

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: నాయుడుపేట పురపాలక సంఘం తుమ్మూరు పరిధిలోని జగనన్న లేఅవుట్ ఎదుట వైకాపా నాయకుడు అడ్డంగా కంచె వేశారు. రోడ్డు పొడవునా ఉండే స్థలం తన బంధువులకు చెందినదని కంచె వేయడంతో లేఅవుట్‌లోని లబ్ధిదారులకు ఇబ్బందికర పరిస్థితులు తలెత్తుతున్నాయి.

తుమ్మూరు పరిధిలో సర్వే నంబరు 39-1బీలో ఐదెకరాలకు పైగా స్థలంలో 150 పక్కా ఇళ్ల నిర్మాణానికి అధికారులు చర్యలు తీసుకున్నారు. నిధులు వ్యయం చేసి మరీ వైకాపా నాయకులు అక్కడ ఉన్న గుంతలను పూడ్చారు. కొన్ని ఇళ్లు బేస్‌మెంట్ వరకూ రాగా మరికొన్ని మొదలు పెట్టాల్సి ఉంది. ఈ క్రమంలో స్థానిక వైకాపా యువ నాయకుడు తన బంధువులకు చెందిన భూమి సర్వే నంబరు39-1ఎలో 48 సెంట్లు ఉందని.. లేఅవుట్‌కు మధ్యలో దారికి కొంత స్థలం వదిలి మిగిలిన భూమిలో కంచె వేశారు.


అప్పుడు లేని అభ్యంతరం ఇప్పుడెందుకు..?

ఐదెకరాల స్థలంలో వైకాపా నాయకులు రూ.కోట్లు ఖర్చు చేసి చదును చేశారు. అప్పట్లో ఈ యువ నాయకుడు సమ్మతించారు. అయితే ఇప్పుడు అభ్యంతరం చెప్పడం ఏమిటన్నది ప్రశ్న. స్థలాన్ని అభివృద్ధి చేశాక తమ పట్టా భూమి అంటూ కంచె వేయడం గమనార్హం.

ఎమ్మెల్యే కోరిక మేరకే వదిలాం

జగనన్న పక్కా ఇళ్ల నిర్మాణ సమయంలో అప్పటి ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, ఆర్డీవో రోడ్డు పక్కన ఉండే స్థలం వదలాలని కోరడంతోనే కొంత స్థలం వదిలాం. . ప్రస్తుతం దారికి మాత్రమే స్థలం ఇస్తామని వైకాపా యువ నాయకుడు పేర్కొంటున్నారు. ఈ విషయమై తహసీల్దారు గీతావాణిని వివరణ కోరగా లేఅవుట్‌కు సంబంధించిన వివరాలను తెలుసుకుని తగు చర్యలు తీసుకుంటామన్నారు.

డీఆర్‌డీఏ పీడీగా శోభన్‌బాబు


కలెక్టర్‌ను కలిసిన డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు

తిరుపతి(భవానీనగర్) న్యూస్‌టుడే: తిరుపతి జిల్లా డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టరుగా టీఎన్ శోభన్‌బాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో చిత్తూరు జిల్లా నగరి క్లస్టర్ డ్వామా ఏపీడీగా పనిచేస్తున్న శోభన్ బాబు బదిలీలో భాగంగా తిరుపతి జిల్లా డీఆర్‌డీఏ పీడీగా నియమితులయ్యారు. బాధ్యతలు స్వీకరించిన ఈయన కలెక్టర్ వెంకటేశ్వర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

శోత్రియ భూముల్లో హెచ్చరిక బోర్డుల ఏర్పాటు

ఈనాడు కథనానికి స్పందన

వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: మండలంలోని చిన్నపాండూరు శోత్రియ భూముల్లోకి ప్రవేశిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సోమవారం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. దీనిపై ఈ నెల 3న 'లెక్కచేయమని.. దుక్కిదున్ని' శీర్షికన 'ఈనాడు'లో కథనం ప్రచురితం కావడంతో జిల్లా అధికారులు స్పందించారు. వీరి ఆదేశాల మేరకు తహసీల్దారు రాజశేఖర్ సోమవారం ఆక్రమణలకు గురైన శోత్రియ భూములను పరిశీలించి ఆక్రమణదారులకు నోటీసులు జారీచేశారు. వీఆర్వో చలపతి ఆధ్వర్యంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.



హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ అధికారులు



భళా.. నెరవేరిన కల


ఏపుగా పెరిగిన బొప్పాయి


కాయలు చూపుతున్న రైతు నవీన్‌కుమార్‌రెడ్డి

పుంగనూరు, న్యూస్‌టుడే: స్వల్పకాలిక పంటలతో వస్తున్న నష్టాలను అధిగమించేందుకు రైతు దీర్ఘకాలిక పంటలపై దృష్టి సారించారు. అందరి రైతుల్లా కాకుండా భిన్నంగా ఆలోచించి దీర్ఘకాలిక ప్రయోజనం ఇచ్చే బొప్పాయి సాగు చేశారు. సేంద్రియ ఎరువులు, బిందు సేద్యం వంటి ఆధునిక వ్యవసాయ పద్ధతుల్లో పంట సాగు చేస్తూ రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

✷ చౌడేపల్లె మండలం పుదిపట్ల గ్రామానికి చెందిన నవీన్‌కుమార్‌రెడ్డి నాలుగు ఎకరాల్లో రెడ్‌లేడీ బొప్పాయి సాగు చేశారు. ఎకరాకు 6-7 పద్ధతిలో 900మొక్కలు నాటారు. ఎరువులకోసం ఎకరాకు రూ.40వేలు ఖర్చు చేశారు. దున్నకాలు, డ్రిప్, మొక్కల కొనుగోలుకు రూ. 80వేలు ఖర్చు చేశారు. నాలుగు ఎకరాలకు గాను రూ.4.80లక్షలు ఖర్చయింది. సాగునీటికి బిందు సేద్యం, బోదె సౌకర్యాన్ని ఏర్పాటు చేసుకున్నారు. తక్కువ పెట్టుబడితో మంచి ఫలితాలను సాధించాలని నాణ్యమైన మొక్కలను స్వయంగా పరిశీలించి కొనుగోలు చేశారు. మొక్కల మధ్య 6-7 అడుగుల దూరం ఉండేలా నాటారు. ఎరువులను తగిన మోతాదులో వేస్తూ నీటి తడులను సక్రమంగా అందించారు. మొదళ్ల వద్ద నీరు నిలవకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకొన్నారు. దీంతో బొప్పాయి కాయలు పెద్దవిగా, ఆకర్షణీయంగా ఉన్నాయి.

తోట వద్దనే కొనుగోలు

వ్యాపారులు తోట వద్దకే వచ్చి కిలో రూ.22తో 4కోతలు కోయగా 30టన్నుల దిగుబడితో రూ.6లక్షలకు విక్రయించారు. మరో 7కోతలు వస్తాయి వాటి ద్వారా మరో రూ.7లక్షలు రావచ్చని అంచనా. ధరలు పెరిగితే మరింత లాభం చేకూరే అవకాశం ఉంది. జులైలో కిలో రూ.13 పలుకగా ప్రస్తుతం రూ.22నుంచి రూ.24ల వరకు పలుకుతోంది. మార్కెట్‌లో ధరలు పలుకుతుండడంతో లాభాలే లభిస్తాయని రైతు నవీన్‌కుమార్‌రెడ్డి ఆశిస్తున్నారు. టమాటా, వరి పంటలతో పోల్చుకుంటే బొప్పాయి సాగు లాభదాయకంగా ఉంటుందంటున్నారు.

రైతేరాజు

సమీకృతం.. ఎంతో శ్రేయస్కరం


గొర్రెల మంద

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: జీవాల పెంపకం దారులు గొర్రెలు, మేకలకు సమీకృత ఆహారాన్ని అందుబాటులో ఉంచడం ఎంతో శ్రేయస్కరం. వీటిని స్వయంగా తయారు చేసుకునే అవకాశముంది. మొక్కజొన్న, గోధుమ తవుడు, మినప, కంది, పెసర పొట్టు, వేరుసెనగ చెక్క, లవణ మిశ్రమం తగిన మోతాదులో సిద్ధం చేసుకుని తద్వారా పోషకాలు కల్గిన సమీకృత ఆహారాన్ని సిద్ధం చేసుకోవచ్చు. వీటి వాడకం ద్వారా కలిగే ప్రయోజనాలు ఎంతో పుష్కలంగా ఉంటాయి.

- ❖ సమీకృత ఆహార పదార్థాలు సరైన పాళ్లల్లో అందుతాయి.
- ❖ మేత వృథా అయ్యే అవకాశం ఉండదు. తేలిగ్గా జీర్ణం చేసుకుంటాయి.
- ❖ దాణా ఖర్చు 15 నుంచి 20 శాతం మేర తగ్గే అవకాశం ఉంటుంది.
- ❖ జీవాల్లో ఆశించిన విధంగా ఎదుగుదల ఉంటుంది.
- ❖ అనారోగ్య సమస్యలను తట్టుకునే శక్తి పెంపొందుతుంది.
- ❖ ఎలాంటి రసాయనాలు కలిసే అవకాశం లేక పోవడంతో జీవాలు మరింత పరిపుష్టిగా వృద్ధి చెందగలవు.

- డాక్టర్ ఎన్.వి.శ్రీకాంత్ బాబు, సహాయ సంచాలకులు, పశుసంవర్ధక శాఖ, శ్రీకాళహస్తి

మిరపనారు సాగులో జాగ్రత్తలు

పుత్తూరు, న్యూస్‌టుడే: మిరప ముఖ్యమైన వాణిజ్య పంట. దిగుబడి పెరగాలంటే ఆరోగ్యకరమైన నారు అవసరమని, అందుకు తగ్గట్టు నారు పోయడంలో జాగ్రత్తలు తీసుకోవాలని పుత్తూరు ఉద్యానశాఖ అధికారిణి వెంకట సౌజన్య పేర్కొన్నారు.


మిరప నారు

నారుమడి తయారీ ఇలా.. మిరపలో అధిగ దిగుబడులు సాధించాలంటే ఆరోగ్యవంతమైన నారు అవసరం. అందుబాటులో ఉన్న స్థలాన్ని బట్టి నారు మడులు తయారు చేసుకోవాలి. ఒక మీటరు వెడల్పు, 40 మీ.పొడవు, 15 సెం.మీ. ఎత్తు గల మడిలో ఒక ఎకరం నాటేందుకు అవసరమైన నారు పెంచుకోవచ్చు. ఎక్కువ నారుమడులు తయారు చేసినప్పుడు వీటి చుట్టూ మురుగు పోయేందుకు వీలుగా 30సెం.మీ వెడల్పు గల నీటి కాల్వను ఏర్పాటు చేసుకోవాలి.

వైరస్ నివారణకు విత్తన శుద్ధి

విత్తనం ద్వారా వ్యాప్తి చెందే వైరస్‌ను నివారించడానికి ట్రైసోడియం ఆర్థోఫాస్పేట్‌తో విత్తనశుద్ధి చేయాలి. 150గ్రాముల మందును లీటరు నీటిలో కరిగించి అందులో కిలో మిరప విత్తనాలు వేసి 20 నిమిషాలు నానబెట్టాలి. అనంతరం నీటితో కడిగి విత్తనాన్ని నీడలో ఆరబెట్టాలి.

రసం పీల్చే పురుగుల నివారణ

మిరప విత్తనం శుద్ధి చేయడంవల్ల తక్కువ ఖర్చుతో ఫలితాలను పొందవచ్చు. బదనిక పురుగులను పెంపొందించుకోవచ్చు. సమగ్ర సస్యరక్షణ విధానంలో విత్తనశుద్ధి అనువైనదన్నారు. రసం పీల్చే తామర పురుగు, పేనుబంక పరుగులను నివారించేందుకు ఇమిడాక్లోప్రిడ్‌తో విత్తనశుద్ధి చేసుకోవాలి. ఈ ప్రక్రియలో ముందుగా విత్తనానికి తగినంత తుమ్మ జిగురు కలిపి తర్వాత పొడి మందును వేసి విత్తనాలను బాగా కలియతిప్పి 15 నిమిషాలు నీడలో ఆరబెట్టాలి. ఇది తెల్ల నల్లిని తప్ప మిగిలిన రసం పీల్చే పురుగులన్నింటిని అరికడుతుంది.

ప్రశ్న జవాబు

రేణిగుంట, న్యూస్‌టుడే: వ్యవసాయంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమాధానాలు చెప్పిన మండల వ్యవసాయాధికారి సునీల్‌కుమార్.

ప్రశ్న: కౌలు రైతులకు గుర్తింపు పత్రాలు పొందడం ఎలా.. గుర్తింపుతో ఉపయోగాలు ఏమిటి?

- గోపాల్‌రెడ్డి, మెలగముడి, రేణిగుంట మండలం

జవాబు: భూ యజమాని అనుమతితో ఏ సర్వే నంబర్లో ఎంత విస్తీర్ణం కౌలుకు చేస్తున్నారో వాటి వివరాలు, ఇద్దరి ఆధార్ కార్డులు రైతు సేవా కేంద్రంలో అందజేయాలి. ఇలా చేసిన తరవాత వీఆర్వో విచారణతో గుర్తింపు పత్రాలను అందజేస్తారు. వీటి కారణంగా పంట నష్ట పరిహారం, రాయితీపై ఎరువులు, విత్తనాలు రైతుకు అందుతాయి.

జోరుగా మద్యం దరఖాస్తులు

- ● ప్రథమస్థానంలో తిరుపతి అర్బన్
- ● అత్యల్పంలో గూడూరు డివిజన్

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే: చివరి రెండు రోజుల ముందు మద్యం దుకాణ దరఖాస్తుల దాఖలు జోరందుకున్నాయి. 6వ తేదీ రాత్రి వరకు 227 దుకాణాలకు గాను 165 దరఖాస్తులు దాఖలు కాగా.. 7వ తేదీ సాయంత్రానికి 591 దరఖాస్తులు దాఖలయ్యాయి. ఒక్కరోజులో 426 దరఖాస్తులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా అందాయి. 167 దుకాణాలకు దరఖాస్తులు రాగా.. మరో 60 దుకాణాలకు ఒక్క దరఖాస్తు కూడా ఇప్పటి వరకు రాలేదు. దరఖాస్తుల దాఖలులో తిరుపతి అర్బన్ ప్రథమ స్థానంలో నిలవగా.. గూడూరు డివిజన్ అత్యల్పంలో ఉంది. ముఖ్యంగా గూడూరు ఎక్సైజ్ పరిధిలో అత్యంత తక్కువగా నమోదయ్యాయి. అలాగే సూళ్లూరుపేట, వాకాడు, నాయుడుపేట, చంద్రగిరి ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో దరఖాస్తుల సంఖ్య తక్కువగా ఉంది. బయట వ్యక్తులు దుకాణ టెండర్ దక్కించుకుంటే భాగస్వామ్యం ఇవ్వాలనే ప్రతిపాదనలు కూడా చేస్తున్నట్లు తెలుస్తోంది. తిరుపతిలో ఓ వ్యక్తి కొన్ని దుకాణాలకు 50 దరఖాస్తులు వేసినట్లు ప్రచారం జరుగుతోంది. తిరుపతిలో 32 దుకాణాలకు టెండర్లు పిలవగా 29వ నంబరు దుకాణానికి ఇప్పటివరకు దరఖాస్తులు రాలేదు.

ప్రాంతం	దాఖలైన దరఖాస్తులు	దుకాణాల సంఖ్య
తిరుపతి అర్బన్	215	32
తిరుపతి రూరల్	126	22
చంద్రగిరి	13	17
శ్రీకాళహస్తి	53	30
పుత్తూరు	35	18
సత్యవేడు	28	22
గూడూరు	5	18
వాకాడు	24	15
సూళ్లూరుపేట	14	23
నాయుడుపేట	26	15
వెంకటగిరి	52	15

శిల్పారామంలో దరఖాస్తుల స్వీకరణ

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే: మద్యం దుకాణాల కేటాయింపు నిమిత్తం దరఖాస్తుల స్వీకరణ కౌంటర్‌ను తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో ఏర్పాటు చేసినట్లు జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి నాగమల్లీశ్వరరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పుష్పాల పందిళ్లు.. నవధాన్యాల నమూనాలు


నవధాన్యాలు, ఎండుఫలాలతో వారాహి అమ్మవారు




గుమ్మడికాయతో పూలబుట్ట, సొరకాయతో చేప, దోసకాయతో బాతు

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా తితిదే అధికారులు పలుపుష్ప ప్రదర్శన ఏర్పాటు చేశారు. భక్తులు విశేషంగా తరలివచ్చి వాటిని తిలకించి చరవాణిలో నిక్షిప్తం చేసుకుంటున్నారు. ఇక్కడ పుష్పాలతో డాల్ఫిన్, నెమలి, సీతాకోక చిలుకలు, చేప, చెట్ల నమూనాలు నయనానందకరంగా కనిపిస్తున్నాయి. నవధాన్యాలు, ఎండు ఫలాలతో తయారు చేసిన వారాహి అమ్మవారి నమూనా ఆకట్టుకుంటోంది. కూరగాయలతో తయారు చేసిన చేపలు, బాతు, పూలబుట్ట నమూనాలు కనువిందు చేస్తున్నాయి.

- ఈనాడు, తిరుపతి

గోదాదేవి మాలలు.. చెన్నై గొడుగులు అందజేత


శ్రీ విల్లిపుత్తూరు మాలలకు పూజలు నిర్వహిస్తున్న జీయంగార్లు, చిత్రంలో తితిదే ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి


గొడుగులను అందిస్తున్న ఆర్.ఆర్.గోపాల్‌జీ తదితరులు

తిరుమల, న్యూస్‌టుడే: బ్రహ్మోత్సవాల్లో భాగంగా గరుడసేవలో స్వామివారికి అలంకరించ దలచిన తమిళనాడులోని శ్రీవిల్లి పుత్తూరు గోదాదేవి ధరించిన పూలమాలలను సోమవారం తిరుమలకు తీసుకువచ్చారు. ముందుగా బేడి ఆంజనేయస్వామి ఆలయం వద్దనున్న పెద్దజీయర్ మఠానికి వాటిని తీసుకువచ్చారు. అక్కడ పెద్దజీయర్, చిన్నజీయర్‌స్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించాక మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా శ్రీవారి ఆలయానికి తీసుకెళ్లారు. తితిదే ఈవో జె.శ్యామలరావు, అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి, శ్రీవిల్లి పుత్తూరు ఆలయ స్థానాచార్యులు రంగరాజన్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

● చెన్నైకు చెందిన హిందూ ధర్మార్థ సమితి తొమ్మిది గొడుగులను, పెరుమాళ్ నామాలను అందజేసింది. చెన్నై నుంచి భక్తులు కాలిబాటన తిరుమలకు వాటిని తీసుకొచ్చారు. సమితి ట్రస్టీ ఆర్.ఆర్.గోపాల్‌జీ ఆధ్వర్యంలో అందజేశారు. 11 గొడుగుల్లో ఆదివారం రాత్రి పద్మావతి అమ్మవారికి రెండు గొడుగులు సమర్పించి మిగిలినవి శ్రీవారికి అందజేశారు.

భక్తులకు సమన్వయంతో సేవలందించాలి : ఈవో

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో అత్యంత ప్రముఖమైన గరుడసేవకు విచ్చేసే లక్షలాది మంది భక్తులకు హృదయపూర్వకంగా సేవలందించాలని తితిదే ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ఆస్థాన మండపంలో గరుడసేవకు డిప్యుటేషన్‌పై నియమితులైన ఉద్యోగులతో సమీక్ష నిర్వహించారు. ఈ ఏడాది నాలుగు మాడవీధుల్లోని 183 గ్యాలరీల్లో ఏర్పాట్లను ప్రణాళికబద్ధంగా చేశామన్నారు. పరిష్కరించలేని సమస్య ఉంటే, ఆలస్యం చేయకుండా వెంటనే ఉన్నతాధికారులకు తెలియజేయాలని, సమన్వయంతో పనిచేయాలన్నారు. మాడ వీధుల్లో భక్తులకు సేవలందించేందుకు 563 మంది ప్రత్యేక సిబ్బందిని, 360 మంది సహాయ సిబ్బందిని ఏర్పాటుచేశామన్నారు. ఉదయం 10 గంటలకే గ్యాలరీలన్నీ నిండిపోయే అవకాశాలున్నాయన్నారు.

అభయ ప్రదాయినీ.. అశ్వాసుర సంహారిణి



దేవీ నవరాత్రి వార్షిక ఉత్సవాల్లో భాగంగా సర్వేశ్వరుని అనుగ్రహంతో సర్వేశ్వరిగా జ్ఞానాంబిక లోకకంతకుడైన అశ్వాసురుడ్ని వధించింది. ఈ విశేషోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం రాత్రి ఉత్సవమూర్తికి ప్రత్యేక అలంకరణలు చేపట్టారు. ధూప, దీప, నివేదనాది కైంకర్యాలు ఘనంగా సమర్పించారు. ఈ విశేషోత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

- న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి

దుర్గమ్మకు పట్టువస్త్రాల సమర్పణ



దేవీ నవరాత్రుల సందర్భంగా శ్రీకాళహస్తీశ్వరాలయం తరపున ఈవో చంద్రశేఖర్ ఆజాద్ దంపతులు సోమవారం విజయవాడలోని శ్రీదుర్గామల్లేశ్వరులకు భక్తి శ్రద్ధలతో పట్టువస్త్రాలను సమర్పించారు.

– న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి

వినతులు జాగ్రత్తగా పరిశీలించాలి: కలెక్టర్

తిరుపతి (కలెక్టరేట్), న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి వచ్చే వినతులను జాగ్రత్తగా పరిశీలించి రీఓపెన్ అవకాశం లేకుండా పరిష్కరించాలని కలెక్టర్ డా.వెంకటేశ్వర్ అన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన ఫిర్యాదులపై జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, డీఆర్వో పెంచల కిశోర్‌తో కలిసి జిల్లా అధికారులు, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజల నుంచి అందిన అర్జీని నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.

అధిక ధరలు వసూలు చేసిన జీపులు సీజ్

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే: శ్రీవారి భక్తుల నుంచి ప్రయాణ ఛార్జీలు అధికంగా వసూలు చేసిన ఆరు ప్రైవేటు జీపులను సీజ్ చేసినట్లు అలిపిరి సీఐ రామ్‌కిషోర్ తెలిపారు. తిరుపతి - తిరుమల మధ్య ప్రయాణ ఛార్జీ రూ.100గా నిర్ణయించగా అధికంగా ఛార్జీలు వసూలు చేస్తున్నారని డీఎస్పీ వెంకటనారాయణకు వచ్చిన సమాచారం మేరకు అలిపిరి సీఐ తన సిబ్బందితో కలిసి బాలాజీ బస్టాండు వద్ద విచారించారు. తిరుమలకు రూ.150 వసూలు చేయడాన్ని గుర్తించి ఆరు జీపులను సీజ్ చేశారు.

పశువైద్య వర్సిటీ రిజిస్ట్రార్‌గా రవికుమార్



తిరుపతి (పశువైద్య విశ్వవిద్యాలయం): తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా డా.పి. రవి కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. డా.ఎ.రవి పదవీకాలం జూన్‌లో ముగియగా తాత్కాలిక రిజిస్ట్రార్‌గా డా.చెంగల్వ రాయలు కొనసాగారు. ఇటీవల అమరావతిలో జరిగిన వర్సిటీ పాలకమండలి సమావేశంలో రిజిస్ట్రార్‌గా గన్నవరం ఎన్టీఆర్ పశువైద్య కళాశాలలో ఆచార్యులుగా పనిచేస్తున్న రవికుమార్‌కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించాలని తీర్మానించారు. ఆ మేరకు సోమవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. వర్సిటీలోని సమస్యలు, బోధన, బోధనేతర ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

టాస్క్‌ఫోర్స్ డీఎస్పీగా జి.బాలిరెడ్డి


టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్‌ను కలిసిన డీఎస్పీ జి.బాలిరెడ్డి

తిరుపతి (మంగళం), న్యూస్‌టుడే: ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ డీఎస్పీగా జి.బాలిరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. టాస్క్‌ఫోర్స్ ఇన్‌ఛార్జి, జిల్లా ఎస్పీ సుబ్బరాయుడును, టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్‌ను కలిశారు. ఇది వరకు తితిదే విజిలెన్స్ విభాగం వీజీవోగా పని చేశారు.

వాతావరణ సమస్యలకు పరిష్కారం చూపాలి


సైన్స్ ప్రదర్శనలో ఏర్పాటు చేసిన రాకెట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(మంగళం), న్యూస్‌టుడే: అంతరిక్ష పరిశోధనలో సాంకేతికంగా అత్యున్నత స్థానానికి చేరుకునేలా.. వాతావరణంలో సంభవించే మార్పులకు ఎప్పటికప్పుడు పరిష్కారాలు చూపేలా పరిశోధనలు జరగాలని కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ సూచించారు. తిరుపతి అర్బన్ మండలం మంగళం సమీపంలోని ఎస్వీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో ఇస్రో, షార్ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహించనున్న ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలను కలెక్టర్ సోమవారం ప్రారంభించారు. అనంతరం కళాశాలలో విద్యార్థుల అవగాహన కోసం ఏర్పాటు చేసిన ప్రదర్శనను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా షార్ జనరల్ మేనేజర్ ఎన్.ఎన్.ఎన్.మూర్తి, డిప్యూటీ డైరెక్టర్ పి.సునీల్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించి, ప్రోత్సహించేందుకు ఇస్రో అంతరిక్ష వారోత్సవాల నిర్వహణకు శ్రీకారం చుట్టిందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్. సుధాకర్‌రెడ్డి, సమన్వయకర్తలు శ్రీనివాసులురెడ్డి, డాక్టర్ వి. మధురిమ పాల్గొన్నారు.

సౌత్‌జోన్ క్రికెట్ జట్టు ఎంపిక


ఎంపికలో పాల్గొన్న క్రీడాకారులు


గూడూరుపట్టణం, న్యూస్‌టుడే: గూడూరు పట్టణంలోని ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాలలో సౌత్ జోన్ యూనివర్సిటీ క్రికెట్ జట్టు ఎంపికను జెఎన్‌టీయూ అనంతపురం స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ జోజిరెడ్డి, క్రికెట్ టీం సెలక్టర్ మలిరెడ్డి కోటారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ జిల్లాల నుంచి వచ్చిన పలు కళాశాలల 150 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వీరిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన 16 మందితో తుది జట్టును ఎంపిక చేశారు. త్వరలో చెన్నైలో నిర్వహించే సౌత్‌జోన్ టోర్నమెంట్‌లో ఎంపికైన క్రీడాకారులు పాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ వేణుమాధవ్, ఏవో జె.రామయ్య, పిడి రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు


సీఎం కార్యదర్శి ప్రద్యుమ్న

తిరుమల: శ్రీవారిని పలువురు ప్రముఖులు సోమవారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీబ్రేక్ సమయంలో శ్రీవారి మూలమూర్తిని ఏపీ రాష్ట్ర శిశుసంక్షేమ శాఖమంత్రి సంధ్యారాణి, ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు, వైకాపా ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, ప్రముఖ యూట్యూబర్ దివ్వల మాధురి దర్శించుకున్నారు.

శ్రీవారి దర్శనానికి కాలినడకన వెళ్తూ వృద్ధుడి మృతి


సుబ్రహ్మణ్యం (పాతచిత్రం)

నాగలాపురం, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవేంకటేశ్వరుని దర్శనానికి వెళుతూ భక్తుడు మృతి చెందిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. నాగలాపురం రెడ్డివీధికి చెందిన సుబ్రహ్మణ్యం(65) తన భార్య లత, మరో పదిహేను మంది భక్తులతో కలసి శనివారం ఉదయం కాలినడకన తిరుమలకు బయల్దేరారు. సోమవారం ఉదయం అలిపిరి మెట్ల మార్గంలో కొండను ఎక్కుతుండగా 2400వ మెట్టు వద్ద ఫిట్స్ వచ్చి కింద పడి పోయాడు. కాసేపటికే ఆయన స్పృహ కోల్పోవడంతో సహచర భక్తులు ఆయనను స్థానికుల సహకారంతో అశ్విని వైద్యశాలకు తరలించారు. అప్పటికే గుండె పోటుతో మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. స్వామి సేవకు బయల్దేరిన భక్తులందరూ సహచరుని మృతితో కన్నీటి పర్యంతమై మృతదేహాన్ని నాగలాపురానికి తీసుకువచ్చారు. అందరితో కలుపుగోలుగా ఉండే సుబ్రహ్మణ్యం కారణిలోని కారణేశ్వరాలయ అభివృద్ధిలో కీలకభూమిక పోషించారని గుర్తు చేసుకున్నారు.

వెంకాబ్ కోళ్ల ధరలు

బ్రాయిలర్ (రైతు ధర)	124
రిటైల్	146
లేయర్	110
బ్రాయిలర్స్	212
బ్రాయిలర్స్ స్కిన్ లెస్	241
లేయర్ మాంసం	187

తిరుపతి

•తిరుపతి • చంద్రగిరి

తప్పిపోయిన పిల్లలు తల్లిదండ్రులకు అప్పగింత

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి బ్రహ్మోత్సవాలకు వచ్చి తప్పిపోయిన ఇద్దరు చిన్నారులను పోలీసులు జియో ట్యాగింగ్ ద్వారా గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. సోమవారం ఉదయం 8 గంటలకు తిరుమలలోని శాలినాక్(4) తప్పిపోయాడు. పోలీసులు పబ్లిక్ అడ్రెస్సింగ్ సిస్టమ్ ద్వారా బాలుడిని గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో కత్తుల అఖిల లక్ష్మీ వైష్ణవి(12) తప్పిపోయిన బాలికను మహిళా ఎస్సై పావని గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. **తిరుమల:** నిబంధనలు ఉల్లంఘించి భక్తులకు అధిక ధరలకు తినుబండారాలు, శీతలపానీయాలు అమ్ముతున్న దుకాణాలపై రెవెన్యూ అధికారులు దాడులు నిర్వహించారు. అధిక ధరలకు విక్రయించిన దుకాణాలను సీజ్ చేశారు. రూ.లక్ష జరిమానా వసూలు చేసినట్లు తెలిపారు.

నిందితులను శిక్షించాలి

చంద్రగిరి, న్యూస్‌టుడే: చంద్రగిరిలో టవర్‌క్లాక్ వద్ద ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడానికి యత్నించిన వారిపై చర్యలు తీసుకోవాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. అంబేడ్కర్ ఆశయ పోరాట సమితి అధ్యక్షుడు ఎల్లయ్య ఆధ్వర్యంలో సోమవారం దళిత సంఘాల నాయకులు, బీసీ రజక నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం పోలీసుస్టేషన్‌కు చేరుకుని సీఐ సుబ్బరామిరెడ్డికి ఫిర్యాదు చేశారు.



అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఆందోళన వ్యక్తం చేస్తున్న నాయకులు

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
తిరుపతి : 80080 20003
చంద్రగిరి : 80085 74561
పాకాల : 80085 74563

చంద్రగిరి, న్యూస్‌టుడే:

సమస్య: పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారి విస్తరణలో భాగంగా పనపాకం పంచాయతీ రవణప్పగారిపల్లి వద్ద రోడ్డుపక్కన ఉన్న బస్‌షెల్టర్ కూల్చివేశారు. కొత్తది ఏర్పాటు చేయడంతో పాటు ప్రమాదాల నియంత్రణకు చర్యలు చేపట్టాలి. – వెంకటలక్ష్మి, గృహిణి, రవణప్పగారిపల్లి

సమాధానం: రోడ్డు విస్తరణలో తొలగించారు. న్యాయస్థానంలో కేసుంది. అది పరిష్కారం కాగానే పనపాకం నుంచి గాదంకి టోల్ ప్లాజా వరకు సర్వీసు రోడ్డు ఏర్పాటుకు ప్రతిపాదనలు ఉన్నాయి. – శేఖర్, ఇన్‌ఛార్జి ఎంపీడీవో, చంద్రగిరి

సమస్య: చంద్రగిరి కొత్తపేట ఆర్టీసీ రోడ్డు పక్కన మురుగు కాల్వ చెత్తాచెదారంతో నిండి. కాల్వగట్టుపై పిచ్చి మొక్కలు మొలిచి ఉన్నాయి. – ధనమ్మ, స్థానికురాలు

సమాధానం: పారిశుద్ధ్య కార్మికులతో కాల్వను శుభ్రం చేయించడంతో పాటు పిచ్చిమొక్కలు తొలగిస్తాం. – మహేశ్వరయ్య, ఈవో, చంద్రగిరి

సమస్య: కొటాల పంచాయతీ పరిధిలోని అనంతగుర్రప్పగారి పల్లి ఎస్సీ కాలనీలో 35 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. 2000 లీటర్ల నీటి ట్యాంకును ఏర్పాటు చేశారు. లీకేజీలతో పాచిపట్టి అపరిశుభ్రంగా ఉంది. – పెద్దబ్బ, గ్రామస్థుడు

సమాధానం: లీకేజీలను అరకట్టి పరిసరాలు శుభ్రం చేస్తాం. – మధు, గ్రామ కార్యదర్శి

శ్రీహరి వైభవం.. కళా సౌరభం

తిరుమల, తిరుపతి (గ్రామీణ): సాలకట్ల బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో నాలుగో రోజైన సోమవారం స్థానిక నాదనీరాజనం, ఆస్థాన మండపంలో తితిదే హిందూ ధార్మిక ప్రాజెక్టు ఆధ్వర్యంలో నిర్వహించిన ధార్మిక, సంగీత కార్యక్రమాలు భక్తులను విశేషంగా అలరించాయి. వాహన సేవల ఎదుట ప్రదర్శనలు ఇచ్చే కళాబృందాలపై గ్యాలరీలోని భక్తులతో మాట్లాడి వారి అభిప్రాయాలు తితిదే ఈవో జె.శ్యామలరావు తెలుసుకున్నారు. కల్పవృక్ష వాహన సేవలో నాలుగు ఆధ్యాత్మిక పుస్తకాలను తితిదే ఈవో జె.శ్యామలరావు, అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరితో కలిసి ఆవిష్కరించారు. ● తుమ్మలగుంట కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం కల్పవృక్ష వాహనం, సాయంత్రం సర్వభూపాల వాహనాలపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ధర్మకర్త, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, పరిసర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.









ఆధ్యాత్మిక పుస్తకాలు ఆవిష్కరిస్తున్న తితిదే ఈవో జె.శ్యామలరావు తదితరులు





తిరుక్షేత్రమే భక్తుల పాన్పు

తిరుమల, న్యూస్‌టుడే: గరుడోత్సవ వేళ తిరుమలకు భక్తుల రద్దీ భారీగా పెరిగింది. సోమవారం మధ్యాహ్నానికే సీఆర్వోలో అద్దె గదుల జారీ నిలిపివేయడంతో గదులు దొరకని భక్తులు శ్రీవారి ఆలయం, ఫుట్‌పాత్‌లపై సేదతీరారు. రాత్రివేళ చలితీవ్రత పెరగడంతో భక్తులకు ఇబ్బందులు తప్పడం లేదు.



సీఈవో రవికుమార్‌నాయుడికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్టీయూ నాయకులు

పీఎఫ్ సమస్యలు పరిష్కరించాలి

చిత్తూరు జడ్పీ: ఉద్యోగ, ఉపాధ్యాయులు జడ్పీ పీఎఫ్ సమస్యలు పరిష్కరించాలని ఎస్టీయూ నాయకులు విజ్ఞప్తి చేశారు. జడ్పీ కార్యాలయంలో ఆయనకు సోమవారం తిరుపతి జిల్లా ఎస్టీయూ నాయకులు పుష్పగుచ్ఛం అందజేసి, పీఎఫ్ సమస్యలపై చర్చించారు. నాగేశ్వరరావు, ధనంజయనాయుడు, జగన్నాథం, వాసు, మునిరాజ, హమీద్‌బాషా పాల్గొన్నారు.

పారిశ్రామికవేత్తల తోడ్పాటు అవసరం

తిరుపతి (క్రీడలు), న్యూస్‌టుడే: క్రీడాభివృద్ధికి పారిశ్రామికవేత్తల తోడ్పాటు అవసరమని ఏపీ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ఛైర్మన్ అనిమిని రవినాయుడు పేర్కొన్నారు. దిగువమాఘం గ్రామంలోని మాజీ మంత్రి గల్లా అరుణకుమారి నివాసంలో ఆమెను మర్యాద పూర్వంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.



మాజీ మంత్రి అరుణకుమారికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న రవినాయుడు

బాధ్యతల స్వీకరణ

చంద్రగిరి : యర్రావారిపాలెం ఎంపీడీవోగా అరుణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు జిల్లా నింద్ర నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. **పాకాల :** దామలచెరువు మేజర్ పంచాయతీ కార్యదర్శిగా యుగంధర్ బాధ్యతలు స్వీకరించారు. కల్లూరులో విధులు నిర్వర్తిస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఢిల్లీబాబు కొత్తకోటకు బదిలీ అయ్యారు. **చిన్నగొట్టిగల్లు :** ఎంపీడీవో గిడ్డయ్యను తెదేపా నేత బెల్లంకొండ మురళి ఆధ్వర్యంలో నాయకులు సత్కరించారు.

సిద్ధార్థలో స్వాగతోత్సవం

తిరుపతి (గ్రామీణ), న్యూస్‌టుడే: గొల్లపల్లి వద్ద ఉన్న సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో ఫ్రెషర్స్‌డే వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల కార్యదర్శి వై.ఆనంద రెడ్డి, ప్రిన్సిపల్ రాజశేఖర్, పలు విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు.

నగరపాలిక కమిషనర్‌కు 43 వినతులు

తిరుపతి (నగరపాలిక), న్యూస్‌టుడే: నగరపాలక కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 43 వినతులు అందాయి. కమిషనర్ ఎన్.మౌర్య వినతులు స్వీకరించి సంబంధిత అధికారులతో సమాధానం ఇప్పించారు. నిర్దేశిత సమయంలోపు పరిష్కారం చూపాలని ఆదేశించారు. వీధి దీపాలు, వీధుల శుభ్రత, తాగునీటి సమస్యలు, టీడీఆర్ బాండ్లు, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయడం వంటి సమస్యలు ఎక్కువగా వచ్చాయి. శెట్టిపల్లి వాసులు విలీన సమస్యల్ని నివేదించారు. ప్రతి సమస్యను పరిష్కరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కమిషనర్ ఆదేశించారు.



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్. మౌర్య

అనుమతులు లేని ప్రకటనలు తొలగించండి

తిరుపతి (నగరపాలిక), న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ పరిధిలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనుల పురోగతి, పారిశుద్ధ్యం నిర్వహణ, తాగునీటి సరఫరా, పన్నుల వసూలు తదితర కీలక అంశాలపై నగరపాలక కమిషనర్ ఎన్.మౌర్య సోమవారం విభాగాధిపతులతో సమీక్షించారు. నగరపాలక సంస్థకు బకాయిలు ఉన్న ప్రకటన ఏజెన్సీల నుంచి రుసుములు వసూలు చేయాలని పట్టణ ప్రణాళిక విభాగం అధికారులను ఆదేశించారు. నగరంలో ఎక్కడా అనుమతులు లేకుండా ప్రకటనల బోర్డులు ఏర్పాటు చేయనివ్వరాదని, అలాంటి వాటిని వెంటనే తొలగించి జరిమానాలు విధించాలని అధికారులను ఆదేశించారు. టి.డి.ఆర్. బాండ్ల గురించి పూర్తి వివరాలు సిద్ధం చేసి నివేదిక సమర్పించాలన్నారు. అనధికారిక లేఔట్లు, అనుమతి లేని నిర్మాణాలు తొలగించాలని, ఆక్రమణలను తొలగించాలని స్పష్టం చేశారు. ప్రతిరోజూ ఇంటింటి చెత్త సేకరణ సమర్థంగా చేపట్టాలని ఆమె శానిటరీ అధికారులను ఆదేశించారు. ఏసీ చరణ్‌తేజ రెడ్డి, ఎస్ఈ మోహన్, రెవెన్యూ అధికారులు సేతుమాధవ్, రవి, ఆరోగ్య విభాగాధిపతి యువ అన్వేష్‌రెడ్డి, ప్రణాళిక అధికారులు బాలాజీ, రమణ పాల్గొన్నారు.

అడవులు, వన్యప్రాణులను సంరక్షించాలి

తిరుపతి(జీవకోన), న్యూస్‌టుడే: అడవులు, వన్యప్రాణులను సంరక్షించాలని అప్పుడే పర్యావరణ సమతుల్యత దెబ్బతినకుండా ఉంటుందని అనంతపురం సీసీఎఫ్ యశోధాబాయి అన్నారు. తిరుపతి శ్రీవేంకటేశ్వర జంతు ప్రదర్శనశాలలో నిర్వహించిన వన్యప్రాణి వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వన్యప్రాణుల ప్రాధాన్యతను చిన్నతనం నుంచే తెలుసుకోవాలని, తల్లిదండ్రులు కూడా ఆదిశగా పిల్లలను ప్రోత్సహించాలని సూచించారు. వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏపీటీఏ రీజనల్ డైరెక్టర్ రాపూరి రమణప్రసాద్, జూ అసిస్టెంట్ ఏసీఎఫ్ నాగభూషణం, అసిస్టెంట్ క్యూరేటర్ జగదీశ్ చంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



గెలుపొందిన విద్యార్థికి ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న సీసీఎఫ్ యశోధాబాయి, ఏపీటీఏ రీజనల్ డైరెక్టర్ రమణప్రసాద్, జూ. అసిస్టెంట్ ఏసీఎఫ్ నాగభూషణం

కార్యాలయాలా.. మడుగులా..!



చిన్న చినుకు పడినా మండలంలోని ఎంఈవో, సింగిల్ విండో కార్యాలయాలు మడుగును తలపిస్తున్నాయి. దీంతో కార్యాలయాలకు వచ్చే అధికారులు, ప్రజలు నీళ్లలోనే వెళ్లాల్సిన పరిస్థితి. ఈ కార్యాలయాలు రామచంద్రాపురం-అప్లాయిగుంట ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్నాయి. రోడ్డుకన్నా పల్లంగా ఉండటంతోనే ఈ పరిస్థితి తలెత్తిందని స్థానిక ప్రజలు పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, రామచంద్రాపురం

తైక్వాండో విజేతలకు బహుమతుల ప్రదానం

తిరుపతి(క్రీడలు), న్యూస్‌టుడే: తిరుపతిలోని శ్రీశ్రీనివాస క్రీడా సముదాయంలో జరుగుతున్న అండర్-14, 17 స్కూల్ గేమ్స్ రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలు పోటాపోటీగా జరుగుతున్నాయి. సోమవారం అండర్-14, 17 విభాగాల్లో పలువురు బాలబాలికలు తలపడ్డారు. గెలుపొందిన విజేతలకు తెదేపా నేత, డాలర్స్ గ్రూప్ ఛైర్మన్ దివాకర్ రెడ్డి, స్కూల్ గేమ్స్ సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి భానుమూర్తి రాజు చేతుల మీదుగా పతకాలు, జ్ఞాపికలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి సయ్యద్ సాహెబ్, స్కూల్ గేమ్స్ ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శి బాబు, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా కార్యదర్శి సుబ్రహ్మణ్యం రెడ్డి పాల్గొన్నారు.



విజేతలకు జ్ఞాపిక అందజేస్తున్న దివాకర్‌రెడ్డి

కూటమి ప్రభుత్వానికి బ్రాహ్మణుల కృతజ్ఞతలు

తిరుపతి(భవానీనగర్) : కూటమి ప్రభుత్వం వందరోజుల పాలనలో బ్రాహ్మణులకు ఇచ్చిన తొమ్మిది హామీల్లో ఏడింటిని నెరవేర్చిందని బ్రాహ్మణ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ బుజ్జి రామ్‌ప్రసాద్ హర్షం వ్యక్తంచేశారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. ఆలయాల కమిటీల్లో చోటు, దూపదీప నైవేద్యాలకు ఇస్తున్న మొత్తం రూ.10 వేలకు పెంచడం శుభపరిణామమన్నారు. హనుమంతరావు, జయలక్ష్మి పాల్గొన్నారు.

పౌరసరఫరాల శాఖ కార్మికుల ధర్నా

తిరుపతి (కలెక్టరేట్) : పౌరసరఫరాల శాఖ గోదాముల కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. కార్మికులకు ప్రతినెలా 5వ తేదీ లోపు జీతాలు చెల్లించాలన్నారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు. నాయకులు రాధాకృష్ణ, రవి, చంద్రశేఖర్, అయ్యప్ప, చెంచు, సుబ్రహ్మణ్యం, సురేష్ పాల్గొన్నారు.



తిరుమల: శ్రీవారి ఆలయం ఎదుట ఫొటోషూట్‌లో దివ్వల మాధురి, పక్కనే వైకాపా ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

దాడులు నిలిపివేయాలి


తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: గాజాపై ఇజ్రాయిల్ కొనసాగిస్తున్న దాడులను వెంటనే నిలిపివేయాలని వామపక్ష పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. తిరుపతిలోని వేమన విజ్ఞాన కేంద్రంలో గాజాపై దాడులు నిలపాలంటూ వామపక్ష నాయకుల ఆధ్వర్యంలో సోమవారం సదస్సును నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, నాయకులు సుబ్రహ్మణ్యం, చిన్నం పెంచలయ్య, సత్తార్, హరీష్, గోపి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



రామచంద్రాపురం: శ్రీలలితాదేవిగా శ్రీదుర్గాదేవి అమ్మవారు



తిరుపతి (గ్రామీణ): చెంచువారికాలనీలో లలిత త్రిపుర సుందరీగా మూలస్థాన ఎల్లమ్మ



తిరుపతి (బైరాగిపట్టెడ): జగజ్జననిగా కన్యకా పరమేశ్వరి



యర్రావారిపాలెం: విశేష అలంకరణలతో శ్రీసిద్ధేశ్వరిదేవి



చంద్రగిరి: అశ్వవాహనంపై గాయత్రి దేవిగా మిట్టగంగమ్మతల్లి

భక్తిశ్రద్ధలతో దేవీ శరన్నవరాత్రులు

వాడవాడలా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం శక్తి ఆలయాల్లోని అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు.

– న్యూస్‌టుడే బృందం

రూ.కోట్లు వెచ్చించారు.. వృథాగా వదిలేశారు

● రోడ్డుపైనే దుకాణాల నిర్వహణ
● చోద్యం చూస్తున్న నగరపాలక యంత్రాంగం

తిరుపతి(నగరపాలిక), న్యూస్‌టుడే: తిరుపతి నగరంలో కూరగాయల మార్కెట్లు వీధికెక్కాయి. నగరం విస్తరించక ముందు తిరుపతి మొత్తానికి ఇందిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్, రామచంద్ర పుష్కరిణి సమీపంలో రామచంద్రగట్టు మార్కెట్లు మాత్రమే ఉండేవి. కొవిడ్ సమయంలో ఇవి మూతపడటంతో నగరంలోని 9 ప్రాంతాల్లో తాత్కాలిక మార్కెట్లు ఏర్పాటు చేశారు. కొవిడ్ వెళ్లిపోయినా తాత్కాలిక మార్కెట్లు మాత్రం మరింత విస్తరించి రోడ్లు, ఫుట్‌పాత్‌లు, వీధులను ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్నారు. నగరంలో నాలుగు తాత్కాలిక మార్కెట్లు నిర్మించి వారిని అక్కడికి తరలిస్తామని అధికారులు రూ.కోట్లు వెచ్చించి మార్కెట్లు నిర్మించినా ఫలితం శూన్యం.

ఎక్కడెక్కడంటే...

నగరంలో మార్కెట్ వికేంద్రీకరణలో భాగంగా ఆయా ప్రాంత వాసులకు అనువుగా ఉండేలా నాలుగు దిక్కులా మార్కెట్లు నిర్మించాలని కొవిడ్ సమయంలో నిర్ణయించారు. ఇందుకు రూ.5.10 కోట్లు వెచ్చించాలని నగరపాలక అధికారులు తీర్మానించారు. వైకుంఠపురం ఉద్యానవనం సమీపంలో రూ.53లక్షలతో 47 దుకాణాలను 2020లో ప్రారంభించారు. వెంటనే కరకంబాడి మార్గంలోని బొంతాలమ్మ ఆలయం వద్ద రూ.3.50 కోట్లతో 200 దుకాణాలు నిర్మించనున్నట్లు ప్రకటించారు. బొంతాలమ్మ గుడి వద్ద భూమిపూజ అనంతరం... అదే రోజు కొర్లగుంటలో రూ.60లక్షలతో 60 దుకాణాల నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యే కరుణాకర్‌రెడ్డి భూమిపూజ చేశారు. న్యూ బాలాజీ కాలనీ సమీపంలో రూ.20 లక్షలతో నిర్మించారు. ఖాదీ కాలనీ, స్విమ్స్ పరిసరాల్లో స్థలాన్వేషణ చేసి తర్వాత గాలికొదిలేశారు.

వృథాగా మార్కెట్లు

రూ.20లక్షలతో న్యూ బాలాజీ కాలనీలో నిర్మించిన మార్కెట్ శిలాఫలకం ఆవిష్కరణకే పరిమితమైంది. ప్రారంభించి 24నెలలైనా దీనిని వినియోగంలోకి తీసుకురాలేదు. కొర్లగుంట వద్ద భూమిపూజ చేసిన మార్కెట్‌కు ఇంకా పునాది రాళ్లు పడలేదు. వైకుంఠపురం మార్కెట్‌ను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురాలేదు. బొంతాలమ్మ ఆలయం వద్ద తొలుత కూరగాయల మార్కెట్‌గా ప్రారంభమైన ఆలోచన ఇప్పుడు వాణిజ్య సముదాయాలుగా మారాయి. ఒక్కో దుకాణం పొందేందుకు రూ.50 లక్షలు వెచ్చించాల్సి ఉండటంతో లీజుకు తీసుకునేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు.



వైకుంఠపురం మార్కెట్ ఖాళీగా ఉన్న దృశ్యం



నగరపాలక పాఠశాల ఎదుట ఆక్రమణలు

దుకాణాలతో అంతరాయం

బొంతాలమ్మ ఆలయం వద్ద అప్పట్లో ఏర్పాటు చేసిన దుకాణాలు రోడ్లు, ఫుట్‌పాత్‌లపై విస్తరించాయి. రామానాయుడు నగరపాలక పాఠశాల వద్ద ఏర్పాటైన తాత్కాలిక దుకాణాలు పాఠశాల పరిసరాలను పూర్తిగా ఆక్రమించుకుని ట్రాఫిక్‌కు, విద్యార్థులకు అంతరాయం కలిగిస్తున్నాయి. పద్మావతి కల్యాణ మండపాల వద్ద ఏర్పాటైన తాత్కాలిక మార్కెట్లు శాశ్వత దుకాణాలుగా మారాయి.

అనుమతితోనే నిర్వహణ

నగరపాలక అనుమతితోనే దుకాణాలు పెట్టామని.. నిత్యం గేటు చెల్లించి అధికారికంగా కూరగాయల మార్కెట్లు నిర్వహిస్తున్నట్లు దుకాణ యజమానులు చెబుతున్నారు.

శ్రీకాళహస్తి

• శ్రీకాళహస్తి • సత్యవేడు

అనుమతి లేకుండా గ్రావెల్, ఇసుక తరలించరాదు


మాట్లాడుతున్న తహసీల్దారు సుబ్రహ్మణ్యం

బీఎన్‌కండ్రిగ: గ్రావెల్, ఇసుక అనుమతి లేకుండా తరలించరాదని తహసీల్దారు సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. సోమవారం ఆయన స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఎస్సై విశ్వనాథనాయుడు, ఎంపీడీవో త్రివిక్రమరావులతో సమావేశం నిర్వహించారు. కాళంగి నదిలో ఇసుకరీచ్‌లు లేవన్నారు. కాళంగి నది నుంచి ఇసుకను, చెరువుల్లో మట్టిని అనుమతులు లేకుండా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తెదేపా మండల అధ్యక్షులు ఎం.సుధాకర్‌నాయుడు, డీటీ చంద్రబాబునాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

శివయ్యను దర్శించుకున్న మంత్రి


మంత్రి సంధ్యారాణికి స్వాగతం పలుకుతున్న అధికారులు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: మంత్రి జి.సంధ్యారాణి కుటుంబ సభ్యులతో శ్రీకాళహస్తీశ్వరుని దర్శించుకున్నారు. దర్శనార్థం వచ్చిన ఈమెకు ఆలయ డిప్యూటీ కమిషనర్ ఎన్.ఆర్.కృష్ణారెడ్డి ఘనంగా స్వాగతం పలికారు. ఆలయంలో స్వామి, అమ్మవార్ల దర్శనంతో పాటు వేదాశీర్వాదం పూర్తయ్యాక తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ తనిఖీ అధికారి హరియాదవ్, ఏపీఆర్వో రవి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వసతులు కల్పిస్తాం


డయాలసిస్ కేంద్రంలో వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న బొజ్జల బృందమ్మ

తొట్టంబేడు, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి మెరుగైన వసతులు కల్పిస్తామని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తల్లి బొజ్జల బృందమ్మ తెలిపారు. సోమవారం పట్టణంలోని ప్రాంతీయ ఆసుపత్రిని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గత తెదేపా పాలనలో ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రాన్ని పరిశీలించి అక్కడి సమస్యలను వైద్యులను అడిగి తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. బాలింతల వార్డుకు చేరుకుని వారికి అందుతున్న వైద్య సదుపాయాలపై ఆరా తీశారు. అనంతరం సమీపంలోని అన్న క్యాంటీన్‌కు చేరుకుని ఆహార నాణ్యతను పరిశీలించారు. అక్కడ భోజనం చేస్తున్న వారిని రుచి ఎలా ఉందన్న విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. రుచి, శుభ్రతతో ఆహారాన్ని పేదలకు అందించాలని నిర్వాహకులకు సూచించారు.

అవగాహన లేక.. అవస్థలు తప్పక

బయోమెట్రిక్ కష్టాలు వర్ణనాతీతం


శ్రీకాళహస్తీశ్వరాలయ పరిపాలన భవనం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తీశ్వరాలయంలో గడిచిన అయిదేళ్ల విధులకు వచ్చామా.. హాజరు నమోదులో సంతకాలు పెట్టామా.. వెళ్లామా అన్నట్లు నడుచుకుంటూ వచ్చిన ఉద్యోగులు, సిబ్బందికి చుక్కలు కన్పిస్తున్నాయి. వైకాపా హయాంలో ఉద్యోగులు విధులకు హాజరవుతున్నారా.. లేదా అన్నది పట్టించుకున్న పాపానపోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బయోమెట్రిక్ హాజరు అందుబాటులోకి తీసుకురావడంతో దుమ్మా కొట్టి వ్యక్తిగత పనులతో బిజీగా ఉంటున్న ఉద్యోగులు, సిబ్బంది దారికొస్తున్నారు. సెప్టెంబరు నెలకు సంబంధించి కొంత వెసులుబాటు కల్పించినా అక్టోబరు నుంచి విధిగా అమలు చేస్తామని ఇప్పటికే ఉన్నతాధికారులు స్పష్టం చేయడం గమనార్హం.


పరిపాలన భవనంలో ఏర్పాటు చేసిన బయోమెట్రిక్ యంత్రం

ఇబ్బందులు: ఆలయంలో శాశ్వత ఉద్యోగులు, సిబ్బందితో పాటు ఎక్కువ మంది పొరుగు సేవకులు, ఒప్పంద ఉద్యోగులు, వివిధ రకాల ఏజెన్సీల ద్వారా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు ఎక్కువ. అయితే ఉద్యోగులు, సిబ్బంది హాజరును బయోమెట్రిక్ ద్వారా వేయాలని నిబంధనలు పెట్టారు. అయితే శాశ్వత ఉద్యోగులను అటుంచితే మిగిలిన విభాగాల్లో పనిచేసే సిబ్బంది దీనిపై అవగాహన లేక అవస్థలు పడాల్సి వస్తోంది.

నిర్ణయం.. సర్వత్రా సంకటం: బయోమెట్రిక్ విధానం పరిపాలన పారదర్శకతకు ఎంతో అవసరమైనప్పటికీ అమలు విషయంలో కొంత ఇబ్బందులు తప్పడం లేదు. ముక్కంటి ఆలయం వేకువజామున 4 నుంచి రాత్రి 10 గంటల వరకు శాశ్వత ఉద్యోగులు, సిబ్బంది విధిగా ఉండాల్సిందే. అందుకే షిఫ్టుల ప్రకారం విధులు నిర్వహిస్తుంటారు. అయితే ఇలాంటి వాళ్లు రెండు దఫాలు బయోమెట్రిక్ హాజరు వేయాలంటే కష్టసాధ్యం. ఇక అనుబంధ ఆలయాల విషయానికి వస్తే పట్టణానికి దూరంగా ఉన్న ఊరందూరు, అర్ధనారీశ్వరస్వామి, భైరవకోన, వేయిలింగాలకోన, బొక్కసంపాళెం, కన్నలి తదితర ప్రాంతాల నుంచి రోజూ రెండు వేళల్లో బయోమెట్రిక్ హాజరు వేయాలంటే అయ్యే పని కాదు. దీనిపై ఉన్నతాధికారులు పునరాలోచనలు జరిపి విధి నిర్వహణలో బాధ్యత కల్పించడంతో పాటు ఉద్యోగులు, సిబ్బంది వైపు నుంచి వాళ్ల ఇబ్బందులకు ప్రత్యామ్నాయ మార్గాలు చూపే విధంగా నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

బుట్టతో కాజేస్తున్నారు



ప్రభుత్వం పేదలకు పంపిణీ చేసే రేషన్‌లో చౌకదుకాణ డీలర్లు చేతివాటం ప్రదర్శిస్తుండటంతో లబ్ధిదారులు తీవ్రంగా మోసపోతున్నారు. బుట్టతో కలిపి బియ్యం తూకం వేస్తుండటంతో ఒక్కొక్క లబ్ధిదారుడు కేజీ వంతున కోల్పోవాల్సి వస్తోంది. ఏర్పేడు మండలంలోని మడిబాక పంచాయతీలో సోమవారం రేషన్ పంపిణీ చేసే సమయంలో దీన్ని గుర్తించిన లబ్ధిదారులు డీలర్‌ను ప్రశ్నించడంతో ప్రతి నెలా సరకు తక్కువగా వస్తుండటంతో ఇలానే సరిపెట్టాల్సి వస్తోందని సమాధానమివ్వడం గమనార్హం. శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని అన్ని రేషన్ దుకాణాల నుంచి గతంలో ఇలాంటి ఆరోపణలు వచ్చినా అధికారులు సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టకపోవడంతో లబ్ధిదారులు వాపోతున్నారు. దీనిపై తహసీల్దార్ భార్గవిని వివరణ కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. - **న్యూస్‌టుడే, ఏర్పేడు**

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
శ్రీకాళహస్తి: 80085 74555
నాగలాపురం: 98854 43308

- న్యూస్‌టుడే, తొట్టంబేడు

సమస్య: శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రిలో దోమల ఉధృతి అధికంగా ఉంది. దీంతో చీకటి పడితే దోమలతో రోగులతో పాటు సహాయకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆస్పత్రి అధికారులు స్పందించి దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి. **- సుప్రజ**

సమాధానం: దోమల నివారణకు ఆసుపత్రి ప్రాంగణంలో ఫాగింగ్ చేయించి, రోగుల ఇబ్బందులు తొలగిస్తాం. **- విజయలక్ష్మి, ఆస్పత్రి పర్యవేక్షకురాలు**

- న్యూస్‌టుడే, రేణిగుంట

సమస్య: రేణిగుంట బస్టాండ్‌లో ట్రాఫిక్ సమస్య తీవ్రమైంది. ఇష్టానుసారంగా పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతుంది. ఆటోలతోనూ ఇబ్బందులు తప్పడం లేదు. పోలీసులు ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలి. **- రమణ, స్థానికుడు**

సమాధానం: ఇక్కడ ట్రాఫిక్ నియంత్రణపై చర్యలు చేపట్టాం. ఆటో యూనియన్ల వారిని హెచ్చరించాం. ఈ సమస్యను పరిష్కరిస్తాం. **- శరత్‌చంద్ర, సీఐ, రేణిగుంట పట్టణం**

- న్యూస్‌టుడే, బీఎన్‌కండ్రిగ

సమస్య: బీఎన్‌కండ్రిగ పంచాయతీ ఐటీసీ కాలనీ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్తు నియంత్రిక తరచూ మరమ్మతులకు గురవుతోంది. హైవోల్టేజీతో ఇళ్లలోని విద్యుత్తు పరికరాలు దెబ్బతింటున్నాయి. కొత్తది ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాకు ఇబ్బంది లేకుండా చూడాలి. **- సురేష్, స్థానికుడు**

సమాధానం: విద్యుత్తు నియంత్రికను పరిశీలిస్తాం. మరమ్మతులకు వీలుకాకపోతే కొత్తది ఏర్పాటు చేస్తాం. **- చెంగల్రాయులు, లైన్ ఇన్‌స్పెక్టర్**

- న్యూస్‌టుడే, నాగలాపురం

సమస్య: నాగలాపురం పాఠశాల సముదాయం వద్ద రహదారిపైనే చెత్త వేస్తున్నారు. చెత్తకుండీ ఉన్నా ఫలితం అంతంతమాత్రమే. విద్యార్థులు, స్థానికులు, భక్తులు ముక్కు మూసుకుని దాటుకుని వెళ్లాల్సి వస్తోంది. **- పురుషోత్తం, నాగలాపురం**

సమాధానం: రెండు రోజుల్లో చెత్తను తొలగించి బ్లీచింగ్, సున్నంలను పిచికారీ చేయిస్తాను. **- చిన్నదురైసుధ, సర్పంచి, నాగలాపురం**








శ్రీకాళహస్తి: మొక్కజొన్న కండెలతో ముత్యాలమ్మకు విశేష అలంకారాలు
❖ అశ్వవాహనంపై శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ❖ ధనలక్ష్మిగా నల్లగంగమ్మ
కామాక్షి దేవిగా శ్రీభవానమ్మ
వరదయ్యపాళెం: మహాలక్ష్మి అవతారంలో కామాక్షి అమ్మవారు
రేణిగుంట: అలంకారంలో గంగమ్మ తల్లి

అనుగ్రహించవమ్మా.. అభయప్రదాయినీ

దేవీ నవరాత్రి వార్షిక ఉత్సవాల సందర్భంగా ముక్కంటి క్షేత్రంలోని శక్తి ఆలయాలు కొంగొత్త శోభ సంతరించుకుంది. అమ్మవారి అనుగ్రహం కోసం వచ్చే భక్తులతో ఆలయ ప్రాంగణాలు కిక్కిరిసిపోయాయి. ముక్కంటి ఆలయంలోని బొమ్మల కొలువు అమ్మవారు, కనకదుర్గ అమ్మవార్లకు విశేష పూజలు, ప్రత్యేక అలంకారాలు చేపట్టారు. ఆలయానికి అనుబంధంగా ఉన్న కనకాచలంపై ఉదయం, సాయంత్రం విశేష అభిషేకాలు జరిపారు. శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజక వర్గాల్లోని అమ్మవారి ఆలయాల్లోనూ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. - **న్యూస్‌టుడే బృందం**


నాగలాపురం: మహాలక్ష్మి అలంకరణలో మరగదాంబికాదేవి


సత్యవేడు: కాళికాదేవిగా


తొట్టంబేడు: శ్రీరాజరాజేశ్వరిగా దర్శనమిస్తున్న బంగారమ్మదేవి


శ్రీకాళహస్తిగ్రామీణం: ముకేశ్వరస్వామి ఆలయంలో జ్ఞానప్రసూనాంబ


చిందేపల్లిలో.. శ్రీపార్వతీదేవి


ఏర్పేడు: గుడిమల్లంలో అన్నపూర్ణాదేవిగా

అ'భద్రత' సిబ్బంది..!

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తీశ్వరాలయంలో విధులు నిర్వహిస్తున్న భద్రతా సిబ్బంది బాగోగులు పట్టించుకునే వాళ్లు లేక అభద్రత మధ్య విధులకు హాజరవుతున్నారు. ప్రధానంగా జీతాలు సక్రమంగా అందక పోవడంతో అవస్థలు పడాల్సి వస్తోంది. పాత ఏజెన్సీ నిర్వాహకులు బకాయిలు ఇచ్చేశామంటున్నారు.. కొత్త ఏజెన్సీ వాళ్లు ఇంకనూ బాధ్యతలు చేపట్టలేదు. ఈ పరిస్థితుల్లో బకాయిలున్న రెండు నెలల జీతాలు ఎవరు చెల్లించాలన్నది ప్రశ్నార్థకంగా మారింది. గత ప్రభుత్వ హయాంలో వలే ఇప్పుడు జీతాలు సక్రమంగా చెల్లించక పోవడం పట్ల సిబ్బంది తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. ఇకనైనా ఆలయ అధికారులు భద్రతా సిబ్బంది సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాల్సి ఉంది.

పంచాయతీ కార్యదర్శుల బదిలీ

సత్యవేడు: మండలంలోని పలువురు పంచాయతీ కార్యదర్శులు బదిలీలు కాగా మరికొందరిని కొత్తగా నియమించినట్లు జిల్లా కలెక్టరేట్ నుంచి ఉత్తర్వులు అందినట్లు ఎంపీడీవో చంద్రశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సత్యవేడు పంచాయతీరాజ్ విస్తరణాధికారి తరుణ్‌కృష్ణారెడ్డిని నియమించారు. తరుణ్ తొట్టంబేడులో ఈఓపీఆర్డీగా పనిచేస్తూ సత్యవేడుకు బదిలీ అయ్యారు. తిరుపతి సాయినగర్‌లో పనిచేస్తున్న రాజేష్‌ను మండలంలోని కల్లడం, ఏర్పేడు మండలంలో గోవిందవరంలో పని చేస్తున్న బాలాజీని మల్లవారిపాలెం ఈస్టుకు, చెన్నంపల్లిలో పని చేస్తున్న సుబ్రహ్మణ్యంను చిన్నఈటిపాకంకు, తిరుపతి మండలం తిరుచానూరు శ్రీనివాస్‌ను సత్యవేడు రెండో సచివాలయానికి, చంద్రగిరి మండలం శ్యానంబట్ల లోకేష్‌ను జడేరికి, చంద్రగిరి మండలం నుంచి శివయ్యను వెంకటరాజులకండ్రిగకు, మండలంలోని ఇరుగుళంలో పని చేస్తున్న ప్రకాష్‌ను వెదురుకుప్పం మండలం బ్రాహ్మణపల్లికి, దాసుకుప్పం పంచాయతీ సెక్రెటరీ రమణమూర్తిని నాగలాపురం మండలం టీపీ కోటకు బదిలీ చేశారు. మదనంబేడు పంచాయతీ సెక్రెటరీ మాధవిని పుదుకుప్పం, జడేరి పంచాయతీ సెక్రెటరీ వాసును రేణిగుంట మండలం కృష్ణాపురానికి బదిలీ చేశారు.

చిరుద్యోగులపై రాజకీయ వేధింపులు తగవు

తొట్టంబేడు, న్యూస్‌టుడే: చిరుద్యోగులపై రాజకీయ వేధింపులు మానుకోవాలని సీఐటీయూ నేతలు పేర్కొన్నారు. మండల వెలుగు కార్యాలయం ఎదుట చిరుద్యోగులపై రాజకీయ వేధింపులకు వ్యతిరేకంగా సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య, జిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్య సంయుక్తంగా మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంలోని రాజకీయ నిరుద్యోగులకు లబ్ధి చేకూర్చడం కోసం అధికారంలోకి వచ్చిన తొలినాటి నుంచే చిరుద్యోగులే లక్ష్యంగా వేధింపులకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.


నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నేతలు

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక


పతకాలతో రేణిగుంట విద్యార్థినులు

రేణిగుంట, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీల్లో తమ విద్యార్థులు అద్భుతమైన ప్రతిభచాటి ఒకరు జాతీయ స్థాయికి ఎంపికైనట్లు రేణిగుంట జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విష్ణువర్ధిని తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లాలోని నున్న ఉన్నత పాఠశాలలో ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు 68వ ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో అండర్ 14, అండర్ 19 రాష్ట్ర స్థాయి బాల బాలికల పోటీలను నిర్వహించారన్నారు. అండర్ 19 విభాగంలో గ్రేసి బంగారు పతకం సాధించిందని, అక్టోబర్ 23 నుంచి 27వ తేదీ వరకు న్యూదిల్లీలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. అండర్ 19 విభాగంలో ఇద్దరు కాంస్య పతకాలు సాధించారని, అండర్ 14 విభాగంలో 4 వెండి, ఒక కాంస్య పతకం సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులను ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు తెలిపారు.

అవీ.. ఇవీ.. అన్నీ..

సర్వేయర్‌గా రాజ్‌కుమార్.. బీఎన్‌కండ్రిగ: మండల సర్వేయర్‌గా రాజ్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న సర్వేయర్ మునస్వామి అనారోగ్యంతో సెలవులో ఉండగా నెల్లూరు పట్టణంలో పనిచేస్తున్న రాజ్‌కుమార్ బదిలీపై బీఎన్‌కండ్రిగకు వచ్చారు.

మహేష్‌కుమార్‌గౌడ్‌కు ఘన స్వాగతం.. రేణిగుంట: తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌కు రేణిగుంట విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. తిరుమల పర్యటన నిమిత్తం సోమవారం ఆయన ఇక్కడికి చేరుకున్నారు. ఆయనకు ఏర్పేడు మండల గౌడ సంఘం నేతలు పుష్పగుచ్ఛం అందించి ఘనంగా స్వాగతం పలికారు. ఏర్పేడు గౌడ సంఘం మండలాధ్యక్షులు ఆంజనేయులుగౌడ్, వెంకటేష్, తేజ, మహేష్, చిరంజీవి, చిట్టిబాబు పాల్గొన్నారు.

డబ్బులు వసూలుపై చర్యలు.. శ్రీకాళహస్తి: భక్తుల నుంచి బలవంతంగా డబ్బులు వసూలు చేసే వాళ్లను సహించేది లేదంటూ ఆలయ ఈవో చంద్రశేఖర్ ఆజాద్ స్పష్టం చేశారు. గోమాత పూజ అయ్యాక సోమవారం ఆలయ ఆవరణలో గోవును ఉంచి డబ్బులు వసూలు చేయడాన్ని ఈవో గుర్తించారు. గోశాల సిబ్బంది వెంకటేశ్వర్లును విధుల నుంచి తొలగిస్తూ ఈవో ఆదేశాలు జారీ చేశారు.

'గ్రీవెన్స్ డే'కు దుమ్మా.. బీఎన్‌కండ్రిగ: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సోమవారం మధ్యాహ్నం 12 గం.ల వరకు విధులకు హాజరు కాలేదు. ప్రతి సోమవారం ఉదయం 10గం.లకు నిర్వహించే గ్రీవెన్స్ డేకు ఆయా శాఖల అధికారులు తప్పని సరిగా హాజరు కావాలని ఉన్నతాధికారులు చెబుతున్నా కొందరు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఎంపీడీవో త్రివిక్రమ రావు మాట్లాడుతూ మండల స్థాయి అధికారులు గ్రీవెన్స్‌డేకి తప్పకుండా హాజరయ్యేలా చూస్తామని తెలిపారు.

యువత క్రీడలపై మక్కువ చూపాలి.. బీఎన్‌కండ్రిగ: యువత క్రీడలపై మక్కువ చూపాలని ఎస్సై విశ్వనాథనాయుడు కోరారు. సోమవారం ఆయన స్థానిక క్రీడా మైదానంలో నిర్వహించిన బ్యాడ్మింటన్ పోటీలను తెదేపా మండల పార్టీ అధ్యక్షులు సుధాకర్‌నాయుడుతో కలిసి ప్రారంభించారు. మధునాయుడు, కార్తీక్‌నాయుడు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

రోశయ్య మృతికి సంతాపం.. సత్యవేడు: రాజగోపాలపురం గ్రామానికి చెందిన తెదేపా రాష్ట్ర లీగల్ సెల్ సెక్రటరీ, ప్రముఖ ఆడిటర్ మాచర్ల రోశయ్య(48) చెన్నైలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. రోశయ్యకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మాచర్ల రోశయ్య మృతితో రాజగోపాలపురంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

అదనపు విధులు వద్దు.. శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో విధులు నిర్వహిస్తున్న వేద పండితులకు అదనపు విధులను రద్దు చేస్తూ ఈవో చంద్రశేఖర్ ఆజాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ముక్కంటి ఆలయ స్థాయికి 16 మంది మాత్రమే వేద పండితులు అవసరమని, అయితే ఇక్కడ 21 మంది విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. పలువురు రాహు, కేతు సర్పదోష నివారణ పూజ మండపాల్లో అదనపు విధులు నిర్వహిస్తున్నారని, ఇకపై అలాంటి అదనపు విధులు వేదపండితులకు కేటాయించకూడదని ఆదేశాలు జారీ చేశారు. దోష నివారణ పూజలకు వాళ్ల అవసరం ఉంటే డిప్యూటీ ఈవో సిఫార్సుతో పంపాల్సి ఉంటుందన్నారు. వేదపండితులందరూ ఇకపై నిత్యం వేదపారాయణ, సాయంత్రం వేళల్లో దీపారాధన కార్యక్రమాలకు షిఫ్టుల ప్రకారం విధిగా హాజరు కావాలంటూ ఆదేశాలు జారీ చేశారు.

ప్రహరీ కూలి చిన్నారికి గాయాలు.. నారాయణవనం: ఎగువబొప్పరాజుపాలెంలో ఆలయ ప్రహరీ కూలి రచన(9) తీవ్రంగా గాయ పడింది. ఈ సంఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. తండ్రి బాలాజీ కథనం మేరకు గ్రామంలోని గ్రామదేవత ఆలయ ప్రహరీ వర్షాలకు నాని దుస్థితికి చేరుకుంది. ఆదివారం రాత్రి స్నేహితులతో కలిసి రచన ఆలయ ప్రాంగణంలో ఆడుకుంటున్న సమయంలో ప్రహరీ కూలి గాయపడిందని తెలిపారు. తిరుపతి రుయా సుపత్రికి తరలించారు.

బ్రాహ్మణులకు బాసట

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: నిరుపేదలైన బ్రాహ్మణులకు బాసటగా నిలిచేందుకు కూటమి ప్రభుత్వం పలు పథకాలు అందుబాటులోకి తీసుకువచ్చిందని బ్రాహ్మణ సాధికార కమిటీ రాష్ట్ర సమన్వయకర్త బుచ్చిరాంప్రసాద్ అన్నారు. శ్రీకాళహస్తీశ్వరుని దర్శనార్థం వచ్చిన ఆయనకు సోమవారం బ్రాహ్మణ సమాజం సభ్యులు ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ప్రభుత్వం ధూప, దీప, నైవేద్య పథకం ద్వారా రూ.10 వేలకు పెంపుదల చేశారన్నారు. నారా లోకేశ్ పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీల మేరకు నిరుద్యోగ వేద పండితులకు నిరుద్యోగ భృతి కల్పించేందుకు త్వరలోనే ప్రభుత్వం చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సాధికార సమితి జిల్లా అధ్యక్షులు హనుమంతరావు, సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


సమన్వయకర్త బుచ్చిరాంప్రసాద్‌కు వేదాశీర్వాదం చేస్తున్న వేదపండితులు


పర్యాటకులకు స్వాగతం పలుకుతున్న ఆలయ అధికారులు

పర్యాటకులకు ఘన స్వాగతం

ఏర్పేడు, న్యూస్‌టుడే: మండలంలోని గుడిమల్లంలో వెలసిన శ్రీపరశురామేశ్వరస్వామి ఆలయానికి చేరుకున్న పర్యాటకులకు అధికారులు ఘన స్వాగతం పలికారు. రాష్ట్రపర్యాటక శాఖ తరపున సోమవారం గుడిమల్లం ఆలయానికి నూతనంగా బస్సులు నడిపారు. ఈ నేపథ్యంలో మొదటి బస్సులో వచ్చిన భక్తులకు పూలమాలలు, మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్ఛారణలతో ఆలయ అధికారులు ఆహ్వానం పలికారు. ఒక్క విగ్రహంపైనే త్రిమూర్తులు కొలువుదీరిన ఈ పురాతనమైన ఆలయం గురించి పర్యాటకులకు వివరించడంతో పాటు దర్శన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ గిరినాయుడు, ఈవో రామచంద్రారెడ్డి, పద్మనాభంనాయుడు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

'యుద్ధం నిలిపివేయాలి'

రేణిగుంట, న్యూస్‌టుడే: పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధాన్ని వెంటనే నిలిపివేసి శాంతిని నెలకొల్పాలని రేణిగుంట రాజ్యాంగ పరిరక్షణ వేదిక నాయకులు డిమాండ్ చేశారు. ఐదు వామపక్ష పార్టీలు జాతీయస్థాయిలో ఇచ్చిన పిలుపులో భాగంగా సోమవారం స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద పాలస్తీనాకు మద్దతుగా రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సీపీఐ నాయకుడు తులసీరాజన్, సీపీఎం మండల కార్యదర్శి హరినాథ్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు రావణ, ఆవాజ్ సంఘం నాయకుడు దిలీప్‌బాషా, జమాతి ఇస్లాం సంస్థ అమీర్‌బాషా, ఐద్వా నాయకురాలు ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

రేణిగుంట, న్యూస్‌టుడే: కరకంబాడి రైల్వే గేట్ సమీపంలో రోడ్డు దాటుతున్న వ్యక్తిని వాహనం ఢీ కొనడంతో అక్కడి కక్కడే మృతి చెందాడు. రేణిగుంట పట్టణ పోలీసుల కథనం మేరకు... తిమ్మినాయుడుపాళ్యంకు చెందిన లింగయ్య(55) రోడ్డు దాటుతుండగా వాహనం ఢీకొని మృతి చెందాడు. మృతదేహాన్ని శవపరీక్షల నిమిత్తం రుయా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గూడూరులో నిమ్మ ధరలు

మొదటి రకం: కేజీ రూ. 60 నుంచి రూ. 90 వరకు

రెండో రకం: కిలో రూ. 50 నుంచి రూ. 60 వరకు

కోళ్ల ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

బ్రాయిలర్	123
లేయర్	115
బ్రాయిలర్	224
బ్రాయిలర్ స్కిన్‌లెస్	246
లేయర్ మాంసం	195

అదనపు విధులు వద్దు.. శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వేద పండితులకు అదనపు విధులను రద్దు చేస్తూ ఈవో చంద్రశేఖర్ ఆజాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ముక్కంటి ఆలయ స్థాయికి 16 మంది మాత్రమే వేద పండితులు అవసరమని, అయితే 21 మంది విధుల్లో ఉన్నారన్నారు.

గూడూరు

•గూడూరు • వెంకటగిరి • సూళ్లూరుపేట

కూరగాయల ప్రదర్శన

కోట, న్యూస్‌టుడే: కోట వెలుగులోని రైతుసాధికార సంస్థ ఆధ్వర్యంలో ఐసీఆర్‌పీ భాగ్యలక్ష్మి సేంద్రియ ఎరువులతో పండించిన పలు రకాల కూరగాయలను స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద సోమవారం ప్రదర్శించారు. స్థానికులు అంజమ్మ, జట్పీటీసీ కోటయ్య, ఎంపీడీవో భవాని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీసీ శంకరయ్య, ఐసీఆర్‌పీలు భాగ్యలక్ష్మి, షమీరా, శివకుమారి, సీసీ వేణు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఉత్సవం

వాకాడు, న్యూస్‌టుడే: వాకాడులోని కైవల్య కులస్థుల ఆధ్వర్యంలో స్థానిక శివాలయంలోని శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామికి ప్రత్యేక అభిషేకాలు, పూజలను సోమవారం నిర్వహించారు. స్వామి ఉత్సవమూర్తులను మేళతాళాలు బాణసంచా నడుమ ఊరేగించారు. ఆలయం వద్ద అన్నదానం చేశారు.



మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా

కొత్తపట్నంలో నిర్వాసితులతో గ్రామసభ

కోట : కోట మండలం కొత్తపట్నం పంచాయతీలో గతంలో ఏపీఐఐసీ క్రిస్ సిటీ ప్రాజెక్టు సంబంధించిన చెన్నై-బెంగళూరు పారిశ్రామిక కారిడార్‌ సేకరించిన ప్రభుత్వ భూములను సాగు చేస్తున్న నిర్వాసితులు రూ.10 లక్షలు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొత్తపట్నంలో సోమవారం సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా నిర్వాసితులతో గ్రామసభ నిర్వహించారు. ఇటీవల మూడు సర్వే బృందాలు సర్వే చేసి 310 ఎకరాలను గుర్తించింది. ఎకరాకు రూ.4 లక్షలు పరిహారం ఇస్తామని సబ్‌కలెక్టర్ ప్రకటించారు. దీంతో నిర్వాసితులు ఎకరాకు రూ.10 లక్షలు ఇవ్వాలని కోరారు.

పరిహారం చెల్లించాకే భూములు అప్పగిస్తాం

చిల్లకూరు, న్యూస్‌టుడే: తమ్మినపట్నం రెవెన్యూ పరిధిలో సెజ్ కోసం ప్రభుత్వం సేకరించిన 914 ఎకరాలకు సంబంధించి పూర్తిస్థాయి పరిహారం చెల్లించాకే భూములను అప్పగిస్తామని రైతులు తెల్చి చెప్పారు. సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనా సోమవారం మరో మారు రెవెన్యూ అధికారులతో కలిసి గ్రామస్థులతో సమావేశమయ్యారు. స్థానిక రెవెన్యూలో 914 ఎకరాలకు 528 ఎకరాల్లో 373 మంది సాగు చేస్తున్నట్లు సర్వే బృందాలు గుర్తించాయని చెప్పారు. ఇక్కడి పరిస్థితి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి అందరికీ న్యాయం జరిగేలా చూస్తామని సబ్ కలెక్టర్ వారికి హామీ ఇచ్చారు.

ప్రతి అర్జీకి పరిష్కారం చూపండి



సమస్యలు తెలుసుకుంటున్న ఆర్డీవో కిరణ్మయి

సూళ్లూరుపేట: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి వచ్చే ప్రతి వినతిని నిశితంగా పరిశీలించి, సకాలంలో పరిష్కరించాలని ఆర్డీవో కిరణ్మయి సూచించారు. సూళ్లూరుపేట ఆర్డీవో కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి ఆమె అర్జీలను స్వీకరించారు. ప్రతి వినతిని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. కాగా ఈ కార్యక్రమానికి పలు శాఖల అధికారులు గైర్హాజయ్యారు.

కలెక్టర్ హెచ్చరికలు చేసినా.. కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ జులై 15న స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. అర్జీదారులు ఎవరూ లేకపోవడంతో ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు. డివిజన్‌లోని తొమ్మిది మండలాల్లో సమస్యల్లేవా అని ప్రశ్నించారు. ఈ సందర్భంగా అధికారులు సక్రమంగా కార్యక్రమానికి హాజరు కావడం లేదని ఆయన దృష్టికి తీసుకెళ్లగా దీనిపై ఆయన ఒకింత అసహనం వ్యక్తం చేశారు. ప్రతి సోమవారం విధిగా అధికారులు అందరు హాజరు కావాలని సూచించారు.



పొలాల నుంచి నీటిని తీసుకొస్తున్న గ్రామస్థులు

గుక్కెడు తాగునీటికి కటకటే

పొలాల వద్దకు పరుగులు

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని పథకాలు ఎన్ని ఉన్నప్పటికీ ప్రజలకు గుక్కెడు తాగునీటిని అందించలేని పరిస్థితి నెలకొంది. ఏ పార్టీ అధికారంలో ఉన్నా... నేతలు అంతా తామే చేశాం.. ఎక్కడ కూడా తాగునీటి ఎద్దడి లేదని ఆర్భాటపు ప్రకటనలు గుప్పిస్తుంటారు. అలాగే నెల వారీ జరిగే ఉన్నతాధికారుల సమీక్షల్లో గ్రామీణ నీటి సరఫరా ఇంజినీర్లు అన్నీ గ్రామాల్లో పుష్కలంగా తాగునీరు అందిస్తున్నామని, ఎక్కడా సమస్య లేదని చెబుతూ నివేదికలు ఇస్తున్నా క్షేత్రస్థాయిలో అందుకు భిన్నంగా ఉంది.

● దొరవారిసత్రం మండలంలోని తనయాలి గ్రామంలో గుక్కెడు తాగునీటి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చెంతనే కాళంగి నది ఉన్నా వీరికి తాగునీటి వెతలు తప్పడం లేదు. తనయాలి గ్రామానికి తాగునీరు అందించేందుకు సచివాలయం సమీపంలోని కోనేటిమిట్ట వద్ద బోరు వేసి, పైపు లైన్లు ఏర్పాటుచేసి కుళాయిల ద్వారా గ్రామస్థులకు తాగునీరు అందించేలా ఏర్పాట్లు చేశారు. పథకం ఏర్పాటు చేసిన కొద్ది రోజుల వరకు ఆ నీరు తాగేందుకు బాగా ఉండేది. ఆ తర్వాత నుంచి నీటిలో శుద్ధ(సన్నని ఇసుక) వస్తుండటంతో తాగేందుకు పనిరాకుండా పోయింది. బిందెలో నీటిని పట్టుకున్న కొద్దిసేపటికి శుద్ధి తేలిపోతుంది. ఆ నీటిని తాగి పలువురు రోగాల బారిన పడ్డారు. గ్రామస్థులు క్యాన్‌కు రూ. 20 వెచ్చించి, ట్యాంకర్ల ద్వారా వచ్చే నీటిని కొనుగోలు చేసి తాగుతున్నారు. దీంతో గ్రామస్థులకు ఇబ్బందులు తప్పడం లేదు.

● చేతిబోరు ఉంటే ఒట్టు

గ్రామంలో గతంలో పాఠశాల సమీపాన చేతి బోర్లు ఉండేవి. నేడు అవి కనుమరుగు అయ్యాయి. చేతి బోర్లు ఉన్నా సమస్యకు పరిష్కారం ఉండేది. విద్యుత్తు సరఫరా ఉంటేనే తాగునీరు అందుతుంది. లేదంటే రెండు రోజులైనా ఇబ్బంది పడాల్సిందే. ఈ ప్రాంతంలో తరచూ విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలగడం పరిపాటి అయింది.

● వడ్డిపాళెం సమీపానికెళ్లి..

తనయాలి గ్రామంలో తాగునీటిలో శుద్ధ వస్తుండటంతో స్థానికులు వడ్డిపాళెం వద్ద పొలాల్లోకి వెళ్లి మోటార్ల ద్వారా వచ్చే నీటిని తెచ్చుకుంటున్నారు. దీంతో మహిళలు వ్యయ ప్రయాసలకు గురవుతున్నారు. మహిళలు, చిన్న పెద్ద తేడా లేకుండా అందరూ అక్కడకు వెళ్లి తాగునీటిని నిత్యం తెచ్చుకునే పరిస్థితి నెలకొంది.

ఎవరూ స్పందించడం లేదు



గ్రామంలో గుక్కెడు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నాం. కుళాయిల్లో నీరు వస్తున్నా నీటిలో శుద్ధ వచ్చి, తాగేందుకు పనికి రావడం లేదు. దాంతో పొలాల వద్దకెళ్లి తెచ్చుకుంటున్నాం. అధికారులకు, నాయకులకు మా కష్టాలు విన్నవించినా ఎవరు స్పందించలేదు.

- కృష్ణ, సావిత్రమ్మ, మంగమ్మ, తనయాలి

చర్యలు తీసుకుంటాం

తనయాలి గ్రామంలో తాగునీటికి ఇబ్బందు లేకుండా చర్యలు తీసుకుంటాం. క్షేత్రస్థాయిలో పరిశీలించి అందుకు తగ్గట్లు ఏర్పాట్లు చేస్తాం.

- చంద్రశేఖర్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ

న్యూస్‌టుడే, దొరవారిసత్రం

సమస్య: దొరవారిసత్రం మండలంలోని తనయాలి గ్రామం మధ్యలో ఉన్న ర.భ రహదారి గుంతలమయంగా ఉంది. ఈ మార్గంలో పది గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించాల్సి ఉంది. చిన్నపాటి వర్షం పడినా గుంతల్లో నీరు నిలిచిపోయి చెరువును తలపిస్తున్నాయి.

- చంద్రశేఖర్‌రెడ్డి, తనయాలి

సమాధానం: రహదారికి ఇరువైపులా ఆక్రమణలు ఉన్నాయి. దీంతో వర్షపునీరు బయటకు వెళ్లే వీలులేక రహదారిపై ఆగిపోతుంది. సిమెంటు రోడ్డు నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపుతున్నాం. నిధులు మంజూరైన వెంటనే రహదారిని బాగు చేయిస్తాం.

- పరమేశ్వరి, డీఈఈ ర.భ. శాఖ

అదనపు బస్సులు ఏర్పాటు

వాకాడు, న్యూస్‌టుడే: వాకాడు ఆర్టీసీ డిపో పరిధిలోని కోట నుంచి జిల్లా కేంద్రమైన తిరుపతికి బస్సు సర్వీసులను పెంచినట్లు డిపో సీనియర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమ్మ తెలిపారు. ప్రయాణికుల విన్నపాలపై 'ఈనాడు'లో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. స్పందించిన ఆర్టీసీ ఉన్నతాధికారులు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు.

కోట డిస్కంకు ఏడీ నియామకం

వాకాడు: కోట డిస్కం సబ్ డివిజన్‌కు ఎట్టకేలకు విద్యుత్ ఉన్నతాధికారులు కొత్తగా ఏడీని నియమించారు. ఆ మేరకు ఆయన సోమవారం బాధ్యతలు చేపట్టారు. గత నెల 30న 'కోట విద్యుత్ సబ్ డివిజన్‌లో అధికారులేరీ' అన్న శీర్షికన 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన డిస్కం ఎస్ఈ విజయన్ వెంటనే ఏడీని నియమించారు.

స్పందనకు వందనం

రోడ్డుకు మరమ్మతులు

కోట : కోట అడ్డరోడ్డు దెబ్బతినడంతో స్థానిక తెదేపా నాయకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సొంత నిధులతో మరమ్మతులు చేశారు. రోడ్డు దుస్థితిపై పలు పర్యాయాలు 'ఈనాడు'లో కథనాలు ప్రచురితమయ్యాయి. స్పందించిన తెదేపా సీనియర్ నాయకుడు నల్లపరెడ్డిజగన్ మోహన్‌రెడ్డి, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు జలీల్‌అహ్మద్, మాజీ మండలాధ్యక్షుడు పవన్‌కుమార్, ఎంపీటీసీలు సురేష్, షంషుద్దీన్ తదితరులు ముందుకు వచ్చి రోడ్డులోని గుంతలు పూడ్చి యంత్రాలతో మరమ్మతులు చేశారు.

అమృత్ భారత్ పథకంలోకి ఎంపికకు వినతి

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: నాయుడుపేట రైల్వేస్టేషన్‌ను అమృత భారత్ పథకంలోకి ఎంపిక చేసేలా చొరవ తీసుకోవాలని సదరన్ రైల్వే ప్యాసింజర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీని కోరారు. ఈ మేరకు వారు సోమవారం ఆమెను కలిసి వినతి పత్రం అందించారు. కోవిడ్ సమయంలో రద్దుచేసిన రైళ్లను పునరుద్ధరించి, మెము రైళ్లను నాయుడుపేట వరకూ పొడిగించేలా చొరవ తీసుకోవాలని కోరారు. నాయకులు మస్తానయ్య, రఘువరన్, జోసఫ్, కిరణ్‌కుమార్‌లు పాల్గొన్నారు.



సూళ్లూరుపేట: ఎమ్మెల్యేను కలిసిన సదరన్ రైల్వే పాసింజర్స్ అసోసియేషన్ నాయకులు

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: పట్టణంలో మంగళవారం విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని డిస్కం సిబ్బంది తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్తు సరఫరా ఉండదని చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

జీవవైవిధ్యంతోనే మానవ మనుగడ

దొరవారిసత్రం, న్యూస్‌టుడే: జీవ వైవిధ్యాన్ని కాపాడుకుంటేనే మానవ మనుగడ సాధ్యమవుతుందని సూళ్లూరుపేట వన్యప్రాణి విభాగం డీఎఫ్‌వో హారిక తెలిపారు. మండలంలోని నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రంలో జీవవైవిధ్య సదస్సును నిర్వహించారు. ముఖ్యంగా వ్యవసాయంలో రసాయనిక ఎరువులు, పురుగు మందులు వినియోగం తగ్గించడం, ప్లాస్టిక్ వినియోగాన్ని మానివేయాలని సూచించారు. అనంతరం పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో జీవవైవిధ్య రాష్ట్ర కమిటీ సభ్యులు ఖాదర్‌వల్లి, నేలపట్టు రేంజ్ అధికారిణి సౌజన్య, ఎఫ్ఎస్‌వో బాలయ్య, సిబ్బంది పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డీఎఫ్‌వో హారిక



గూడూరు: మహాచండీదేవిగా



సూళ్లూరుపేట: అష్టకాళి అలంకారంలో చెంగాళమ్మ



గూడూరు: అలంకరణలో చాముండేశ్వరీదేవి



తడ: లలిత త్రిపుర సుందరీదేవి అలంకారం

శక్తి స్వరూపిణీ పాహిమాం

దేవీ శరన్నవరాత్రులు వాడవాడలా ఎంతో వైభవంగా జరుగుతున్నాయి. శక్తి ఆలయాల్లో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అమ్మవారు కామాక్షిదేవి, మహాచండి, మోహినిగా వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

- న్యూస్‌టుడే బృందం



సూళ్లూరుపేట: దుర్గామల్లేశ్వరిదేవి..



గూడూరు: అమ్మవారికి గజలక్ష్మి అలంకారం



వెంకటగిరి: వామనావతారంలో..

పర్యాటకులకు ఘన స్వాగతం

ఏర్పేడు, న్యూస్‌టుడే: మండలంలోని గుడిమల్లంలో వెలసిన శ్రీపరశురామేశ్వరస్వామి ఆలయానికి చేరుకున్న పర్యాటకులకు అధికారులు ఘన స్వాగతం పలికారు. రాష్ట్రపర్యాటకశాఖ తరపున సోమవారం గుడిమల్లం ఆలయానికి నూతనంగా బస్సులు నడిపారు. ఈ నేపథ్యంలో మొదటి బస్సులో వచ్చిన భక్తులకు పూలమాలలు, మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్ఛారణలతో ఆలయ అధికారులు ఆహ్వానం పలికారు.

ముందస్తు పరీక్షలతో క్యాన్సర్ నయం

దొరవారిసత్రం, న్యూస్‌టుడే: క్యాన్సర్ వ్యాధికి సరైన చికిత్స తీసుకుని ఆరోగ్యంగా ఉండవచ్చని తొగరాముడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు తరుణ్‌సాయి కుమార్ పేర్కొన్నారు. మండలంలోని తల్లంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం పింక్ బస్సు ద్వారా పలువురికి స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. కార్యక్రమంలో డాక్టరు బాలు, సర్పంచి వీణ, ఎంపీటీసీ సుగుణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

తహసీల్దారుగా శ్రీనివాసులు.. బాలాయపల్లి: బాలాయపల్లి తహసీల్దారుగా శ్రీనివాసులు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దారు ప్రసాద్‌రావు కలెక్టరేట్‌కు బదిలీ అయ్యారు. కలెక్టరేట్ నుంచి బదిలీపై బాలాయపల్లికి శ్రీనివాసులును బదిలీ చేపట్టారు. కార్యాలయ సిబ్బంది ఆయనను సత్కరించారు. ఆర్ఐగా రూపా శ్రీకాంత్ బాధ్యతలు చేపట్టారు.


నిమ్మ పరిశోధనా కేంద్రం అధిపతిగా శ్యామ్‌సుందర్‌రెడ్డి..

వెంకటగిరి : పెట్లూరు నిమ్మ పరిశోధనా కేంద్రం అధిపతిగా శ్యామ్‌సుందర్‌రెడ్డి సోమవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. డాక్టర్ వైఎస్సార్ హార్టికల్చరల్ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో చేపట్టిన బదిలీల్లో భాగంగా అనంతరాజు పేట కళాశాలలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఆయనను పెట్లూరు నిమ్మ పరిశోధనా కేంద్రానికి బదిలీ చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న అధిపతి డాక్టర్ మధుమతి తిరుపతి నిమ్మ పరిశోధన కేంద్రానికి బదిలీ అయ్యారు.

డీఈఈగా చిన్నస్వామి నాయక్.. గూడూరుపట్టణం: గూడూరు గ్రామీణ సబ్ డివిజన్ డిస్కం డీఈఈగా చిన్నస్వామినాయక్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా డిస్కం ఏఈలు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఎంపీడీవోగా మధుసూదన్.. గూడూరుపట్టణం : గూడూరు ఎంపీడీవోగా ఎ.మధుసూదన్‌రావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న వెంకటేశ్వరరావు ఉమ్మడి నెల్లూరు జిల్లా తోటపల్లి గూడూరుకు బదిలీకాగా, అనంతసాగరంలో పని చేస్తున్న మధుసూదన్‌రావు బదిలీపై గూడూరుకు వచ్చారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ఎంపీడీవోను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఏవోగా శ్రీనివాసరావు.. వాకాడు : మండల పరిషత్ కార్యాలయం ఏవోగా శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీగా ఉమామహేశ్వరరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. వెలుగు పథకంలో పనిచేస్తున్న పలువురిని వివిధ ప్రాంతాలకు బదిలీ చేశారు.



గిరిజన కాలనీలో పర్యటిస్తున్న ఎస్టీ కమిషన్ సభ్యుడు వి.శంకర్, అధికారులు

ఎస్టీ కాలనీల్లో సమస్యలు గుర్తించాలి

తడ, దొరవారిసత్రం, న్యూస్‌టుడే: ఎస్టీ కాలనీలకు వెళ్లి వారి సమస్యలను గుర్తించి పరిష్కరించాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్ నాయక్ అధికారులకు సూచించారు. మండలంలోని తడ పంచాయతీ సచివాలయం వద్ద సోమవారం ఆయన ఎస్టీలతో సమావేశమయ్యారు. లక్ష్మి గిరిజన కాలనీకి చెందిన మన్నూరు నాగమ్మ ఇంటి స్థలం విషయమై ఆరా తీశారు. సమస్య కోర్టులో ఉన్నందున స్థలం చూపలేకపోయామని తహసీల్దారు శరత్‌బాబు తెలిపారు. కోర్టు పరిధిలో లేని స్థలాన్ని ఎస్టీలకు పంపిణీ చేయాలని ఆయన తహసీల్దారుకు సూచించారు. ఇన్‌ఛార్జి ఎంపీడీవో విజయ్‌కుమార్ తోపాటు సర్పంచి కె.ఆర్ముగం, పలువురు మండల అధికారులు పాల్గొన్నారు.

నక్షత్ర తాబేలు అప్పగింత

గూడూరుపట్టణం, న్యూస్‌టుడే: గూడూరు పట్టణంలోని సాయిబాబా మందిరం వద్ద రోడ్డుపై ఆదివారం రాత్రి వెళ్తున్న నక్షత్ర తాబేలు పట్టుకొని అటవీశాఖ అధికారులకు సోమవారం జనసేన నాయకులు అప్పగించారు. వన్యప్రాణులు సంరక్షణ కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని చెప్పారు. అరుదుగా కనిపించే నక్షత్ర తాబేలు జనసంచారంలోకి రావడంతో అటవీ అధికారులకు అప్పగించామని తెలిపారు. కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బంది కృష్ణయ్య, నాయకులు మోహన్, మనోజ్, క్రాంతి, నాగార్జున్ పాల్గొన్నారు.




నక్షత్ర తాబేలును అటవీ అధికారులకు అప్పగిస్తున్న జనసేన నాయకులు

వైకాపాకు రాజీనామా

వాకాడు : వాకాడు మండలంలోని సముద్ర తీర ప్రాంతాల్లోని వైకాపా నేతలు కొందరు ఆ పార్టీకి సోమవారం రాజీనామా చేశారు. రాజీనామా చేసిన వారిలో వ్యవసాయ మండలి మాజీ ఛైర్మన్ దువ్వూరు అజిత్‌రెడ్డి, నిడిగుర్తి, రావిగుంటపాలెం పంచాయతీల సర్పంచులు మల్లాపు నాగరాజు, వాకాటి బాలకృష్ణారెడ్డి, పూడిరాయదొరువు ఎంపీటీసీ బండి శోభన, పలువురు వార్డు సభ్యులు, మాజీ ఎంపీటీసీ ఈదూరు వెంకటాద్రి, మూలపడవ గ్రామ కమిటీ అధ్యక్షుడు కడూరు చెంగయ్య, రమేష్, ప్రసాద్ తదితరులు వైకాపా కార్యకర్తలు రాజీనామా చేసినట్లు అజిత్‌రెడ్డి ప్రకటించారు.

విజేతలకు అభినందన

కోట, న్యూస్‌టుడే: కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన నలుగురు విద్యార్థులు తిరుపతిలోని మోహన్‌బాబు విశ్వవిద్యాలయంలో నిర్వహించిన కోడింగ్ హాకథాన్‌లో ప్రథమ స్థానం పొందారని కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. విజేతలకు ప్రసంశాపత్రాలు, రూ. 35 వేలు నగదు బహుమతిని అందుకొన్నారు. విజేతలైన జశ్వంత్, రేణుక, నందిని, జ్యోష్నను సోమవారం కళాశాలలో అభినందించారు. కార్యక్రమంలో కళాశాల కోడింగ్ క్లబ్ ఇన్‌ఛార్జి కొండారెడ్డి, విభాగాధిపతులు రాజశేఖర్‌రెడ్డి, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.



ధ్రువపత్రాలతో విజేతలు

రైతులు భూసార పరీక్షలు చేసుకోవాలి

వెంకటగిరి, న్యూస్‌టుడే: రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేసుకోవాలని కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ రాజీవన తెలిపారు. కేవీకే, శ్రీనివాసన్ సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం రైతులతో సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం ఎడగారు పంట సాగు సమయంలో భూసార పరీక్షలు చేసుకోవాలన్నారు. ఈ క్రమంలో నమూనా సేకరణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. రైతులకు కరపత్రాలు అందించారు.

ఉప సర్పంచులకు శిక్షణ

నాయుడుపేట, న్యూస్‌టుడే: మండలంలో గ్రామ పంచాయతీ ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ ఇచ్చారు. పంచాయతీ పరిధిలో వనరులు అభివృద్ధి, రాబడి లేఅవుట్లు పన్నుల వసూళ్లు గ్రామ పంచాయతీ పాలకవర్గం విధులు, బాధ్యతల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సురేష్‌బాబు, ఇన్‌ఛార్జీ ఈవోపీఆర్డీ గోపాల్. రిసోర్స్ పర్సన్ వెంట్రావు పాల్గొన్నారు.

వార్డు సభ్యులకు శిక్షణ తరగతులు

బాలాయపల్లి, న్యూస్‌టుడే: వెలుగు కార్యాలయంలో సోమవారం పంచాయతీల ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు రెండు రోజుల శిక్షణ తరగతులను ఎంపీడీఓ వినీల్‌కుమార్ ప్రారంభించారు. పంచాయతీ వ్యవస్థ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందించే దిశగా సభ్యులు దిశానిర్దేశం చేసుకోవచ్చని ఈవోపీఆర్డీ మోహన్ రాజు సూచించారు.

అవీ.. ఇవీ.. అన్నీ..

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: పురపాలక సంఘంలో అస్తవ్యస్తంగా ఉన్న పారిశుద్ధ్యంపై కమిషనర్ చిన్నయ్య ప్రత్యేక దృష్టి పెట్టారు. గత మూడు రోజుల నుంచి రాత్రి వేళ పలుచోట్ల చెత్త సేకరణ చేస్తూ వీధుల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. దీంతో వీధులు కాస్తా శుభ్రం అవుతున్నాయి. ఎవరైనా సమస్యలకు సంబంధించి ఫోన్ చేస్తే వెంటనే ఆ ప్రాంతానికి సచివాలయ సిబ్బంది వెళ్లి సమస్యలను పరిష్కరిస్తున్నారు.

వసతిగృహాల మరమ్మతుకు నిధులు

నాయుడుపేట, న్యూస్‌టుడే: నియోజవర్గంలోని ఐదు బీసీ వసతి గృహాలకు మరమ్మతులకు ఒక్కో భవనానికి రూ1.50 లక్షలు చొప్పున నిధులు మంజూరు చేశారు. నాయుడుపేట పట్టణంలోని లోతువానిగుంట మండలంలో గొట్టిప్రోలు, ఓజిలి మండలంలో చిలమానుచేను తడ, సూళ్లూరుపేట బీసీ సంక్షేమ వసతి గృహాలకు నిధులు కేటాయించారు. మరుగుదొడ్లు మరమ్మతులు, తాగునీటి వసతి కల్పన పనులకు వీటిని ఖర్చు చేయనున్నారు. ఎమ్మెల్యే విజయశ్రీ వినతి మేరకు సంక్షేమ శాఖ అధికారులు నిధులు మంజూరు చేశారు.

మహిళకు కుట్టుమిషన్ అందజేత

గూడూరుపట్టణం: గూడూరు పట్టణంలోని ముత్తూట్ మినీ ఫైనాన్స్ సంస్థ ఆధ్వర్యంలో సామాజిక బాధ్యతలో (సిఎస్‌ఆర్) భాగంగా పట్టణానికి చెందిన ఈశ్వరి అనే మహిళకు కుట్టుమిషన్‌ను సోమవారం అందజేశారు. కార్యక్రమంలో గూడూరు బ్రాంచ్ మేనేజర్ అనీల్‌కుమార్, సిబ్బంది స్వప్న, వెంకటేష్, అనూష తదితరులు పాల్గొన్నారు.

దాడి కేసులో నలుగురి అరెస్ట్

గూడూరుపట్టణం, న్యూస్‌టుడే: గూడూరు పట్టణంలో ఈ నెల 2వ తేదీ రాత్రి జరిగిన జెండా ఉత్సవంలో కత్తితో దాడి చేసిన వేరువేరు ఘటనల్లో నలుగురు నిందితులను అరెస్టు చేసి, రౌడీషీట్ ఓపెన్ చేస్తున్నట్లు ఒకటో పట్టణ సీఐ శేఖర్‌బాబు తెలిపారు. సోమవారం నిందితుల వివరాలను విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. చిన్న మసీదు వీధికి చెందిన హరీష్, యశ్వంత్‌పై అశోక్‌నగర్‌కు చెందిన రాపూరు మనోజ్, మరో మైనర్ బాలుడు కత్తితో దాడి చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు. మరో ఘటనలో నిందితులైన ముగ్గురిని సోమవారం తాళ్లమ్మ గుడి సమీపంలో అరెస్ట్ చేసినట్లు సీఐ శేఖర్‌బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై తిరుమలరావు సిబ్బంది పాల్గొన్నారు.

నిందితుడి ..

చిల్లకూరు : బూదనం గ్రామానికి చెందిన తెదేపా నేత మైలాం శ్రీనివాసులురెడ్డిపై దాడికి పాల్పడిన కేసులో నిందితుడ్ని పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. గ్రామంలో నెలకొన్న దారి వివాదం కారణంగా శ్రీనివాసులురెడ్డిని స్థానికుడు మెల్లకంటి వీరయ్య దాడిచేసి గాయపర్చాడు. నిందితుడ్ని అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచామని పోలీసులు తెలిపారు.

దుకాణాల్లో చోరీ

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: నాయుడుపేట అంబేడ్కర్ విగ్రహం ఎదుట రోడ్డు పక్కన ఉన్న మూడు దుకాణాల్లో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. దుకాణాలకు ఉన్న రేకులు తొలగించి లోపలికి ప్రవేశించి విలువైన వస్తువులు రూ.5వేలు చొప్పున నగదు చోరీ చేశారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయండి

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: రైతులకు నాణ్యమైన విత్తనాలను సరఫరా చేయాలని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు జి.అనిత డీలర్లకు సూచించారు. సూళ్లూరుపేట వ్యవసాయ శాఖ కార్యాలయంలో సోమవారం ఆమె విత్తన డీలర్లతో సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు. రైతులకు ఇబ్బందులు లేకుండా విత్తనాలు, రసాయన ఎరువులను నిర్ణీత ధరలకు విక్రయించాలని, బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలని చెప్పారు.